Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 23.05.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 51 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## శిక్ష కాదు... శిక్షణ!



ప్రతిపక్షనేతగా జగన్

***ఉపాధ్యాయుడిగా చదువు చెప్పాలంటే విద్యార్థిగా చదువుకుని ఉండాలి. అప్పుడే ఉపాధ్యాయుడిగా రాణించగలడు. రాజకీయాలూ అంతే... మంచి ప్రజా ప్రతినిధిగా రాణించాలంటే, మంచి నాయకుడిగా పేరు తెచ్చుకోవాలి.***


ముందు ప్రజల మధ్య నలగాలి, ప్రజల మధ్య తిరగాలి. 'జరిగేవన్నీ మంచికని అనుకోవడమే మనిషి పని' అని మన కవిపుంగవులు ఎప్పుడో పాట రూపంలో రాసారు. ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలలో సంభవించిన పరిణామాలను కూడా తమకు జరిగిన మంచిగానే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత వై.యస్. జగన్మోహన్‌రెడ్డి స్వీకరించాల్సివుంది. భగవంతుడు ఎప్పుడు ఎవరికి ఏ పాత్ర ఇస్తే అది నెరవేర్చడానికి సిద్ధంగా ఉండాలి. వైకాపా అధినేత జగన్ ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి పాత్రను ఆశించాడు. కాని భగవంతుడు ప్రతిపక్ష నేత పాత్ర నిచ్చాడు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పరిపాలకుడికంటే కూడా ప్రతిపక్షనేత పాత్ర ఎంతో గొప్పగా వుంటుంది. ప్రతిపక్షం ఎప్పుడూ చేతిలో కొరడా పట్టుకుని వుంటుంది. అధికార పక్షాన్ని సక్రమ మార్గంలో నడిపిస్తుంది. ఇప్పుడు ఓ బాధ్యతాయుత ప్రతిపక్ష నేతగా జగన్ తన రాజకీయ ప్రస్తానంలో ఇంకో మెట్టు ఎక్కాడు. ఈ ఐదేళ్ల రాష్ట్ర రాజకీయాలు ఆయనకు ఓ శిక్షణ లాంటిది. రాజకీయ నాయకుడిగా రాటుతేలేది ఇక్కడే. ఆయన తండ్రి దివంగత మహానేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి ఒక్కరోజులో ముఖ్యమంత్రి కాలేదు. అయిపోవాలని కూడా అనుకోలేదు. పాతికేళ్లు పోరాడాడు. ప్రతిపక్ష నేతగా రాణించాడు. రాజకీయాల్లో ఒడిదుడుకులు ఎదురుచూసాడు. ప్రతిపక్ష నాయకుడిగా ఆ పాత్రకే వన్నె తెచ్చాడు. కాబట్టే రాష్ట్ర చరిత్రలో చిరస్మరణీయ ముఖ్యమంత్రిగా మిగిలారు. జగన్‌కు ఇప్పుడు తన తండ్రే ఆదర్శం... ఆయన పోరాటం, ఆయన జీవితమే స్ఫూర్తిదాయకం. ప్రతిపక్షంలో కూర్చోబెట్టడం ద్వారా ప్రజలు ఆయనకు వేసింది శిక్ష కాదు... శిక్షణ తీసుకోమని ఉత్తర్వులు జారీ చేసారంతే!



## ఆ'సామాన్యుడు'

(వివరాలు 12వ పేజీలో)

## పాలన ముందు... పెనుసవాళ్ళు!



గుదిబండగా ఋణమాఫీ

***అతివిశ్వాసం ఈ ఎన్నికల్లో వైకాపాను ఓడిస్తే చంద్రబాబులోని ఆత్మవిశ్వాసం తెలుగుదేశంపార్టీని గెలిపించింది. నరేంద్రమోడీ అన్నట్లు ఆయన ఏ దశలోనూ నిరాశ చెందక ఆశావాదంతో పోరాడబట్టే ఈ విజయాన్నందుకున్నాడని చెప్పొచ్చు.***

రాష్ట్ర విభజన ముందువరకు కూడా రాష్ట్రంలో తెలుగుదేశం పరిస్థితి బాగాలేదు. అన్ని జిల్లాల్లో కూడా సగం నియోజకవర్గాలలో అభ్యర్థులు దొరకని పరిస్థితి ఉండింది. మొదట వైకాపా, ఆ తర్వాత కాంగ్రెస్, ఆపైన తెలుగుదేశం అన్నట్లుగా వున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత అయితే, రెండుకళ్ల సిద్ధాంతంతో చంద్రబాబు విభజనకు కారకుడయ్యాడు కాబట్టి దాని ప్రభావం తెలుగుదేశం మీద పడడం ఖాయమనుకున్నారు. విభజన నేపథ్యంలో సమైక్య నినాదం ఎత్తుకున్న వైకాపా బల పడిందని, సమన్యాయం అన్న తెదేపా బలహీన పడిందని మీడియాతో సహా అందరూ భావించారు. రెండు నెలల క్రితం వరకు కూడా ఈ సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ గెలుస్తుందనే నమ్మకం చంద్రబాబులో ఏ దశలోనూ లేదు. అయినా ఆయన నిరాశ చెందక పోరాడిన తీరే ప్రత్యర్థులను సైతం ఆశ్చర్యచకితులను చేస్తుంది. విభజనతో సీమాంధ్రలో కాంగ్రెస్‌పార్టీ పతనమైంది. వైకాపా గేట్లు మూసేయడంతో సీనియర్ కాంగ్రెస్ నాయకులంతా తెలుగుదేశం వైపు క్యూకట్టారు. ఈ ఎన్నికల్లో ఓడిపోతే ఇక తన రాజకీయ ప్రయాణానికి తెరపడుతుందని గ్రహించిన చంద్రబాబు ఎలాగైనా గెలిచితీరాలనుకున్నాడు. అందుకే ప్రజలను ఆకట్టుకునే హామీలకు శ్రీకారం చుట్టాడు. ఇంటికో ఉద్యోగం అన్నాడు, సీమాంధ్రను సింగపూర్ చేస్తానన్నాడు, అన్నింటికి మించి వ్యవసాయ, డ్వాక్రా ఋణాలను రద్దు చేస్తానన్నాడు. ఆయనిచ్చిన వాగ్ధానాలలో ఓట్లు పడేలా చేసింది ఋణమాఫీనే! ఎందుకంటే అన్ని జిల్లాల్లో రైతులు ఏడాది కాలంగా ఋణమాఫీ వాగ్ధానం చేసే పార్టీ కోసం ఎదురు చూస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఋణమాఫీ జరిపి తీరుతుందనే నమ్మకంతో

(మిగతా 10వ పేజీలో)

## సోమిరెడ్డికే ఛాన్స్?



చంద్రబాబు మంత్రివర్గంలో నెల్లూరు జిల్లా నుండి ఎవరుండబోతున్నారనేది పెద్ద ప్రశ్నగా మారింది. దీనికి కారణం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, పరసా రత్నం వంటి సీనియర్లు ఓడిపోవడమే. వీరిలో ఎవరు గెలిచివున్నా మంత్రిపదవి వీరిలో ఒకరికి దక్కేది. ఇప్పుడు జిల్లానుండి టీడీపీ ఎమ్మెల్యేలు ముగ్గురున్నారు. పార్టీలో ముగ్గురికి కూడా పెద్దగా సీనియార్టీ లేదు.

(మిగతా 10వ పేజీలో)

### • జంపింగ్ జపాంగ్స్

## సీన్ మారుతోంది

**ఆకాశంలో తిరిగే గద్దలు తమ పిల్లలను ఎక్కడ తన్నుకుపోతాయోనని కోళ్లు తమ పిల్లలను రెక్కల క్రింద దాచుకుని కాపాడుకుంటుంటాయి. ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ నాయకుల పరిస్థితి కూడా కోళ్లలాగే తయారయ్యింది. జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు అనే కోడిపిల్లలను 'క్యాంప్'లనే తమ రెక్కల క్రింద దాచిపెట్టుకుంటున్నారు.**

సీమాంధ్రలో మున్సిపల్, పంచాయితీరాజ్, సార్వత్రిక ఎన్నికలు వరుసగా జరిగాయి. మున్సిపల్, పంచాయితీరాజ్ ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తే వాటి ప్రభావం సార్వత్రిక ఎన్నికల మీద పడుతుందని భావించిన సుప్రీంకోర్టు

(మిగతా 10వ పేజీలో)



# రాజ్య 'ప్రభ' దక్కేనా?



మాజీముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మృతితో ఆంధ్రప్రదేశ్ నుండి ఒక రాజ్యసభ స్థానం ఖాళీ అయ్యింది. ఆయన పదవీకాలం 2016దాకా వుంది. ఖాళీ అయిన రాజ్యసభ స్థానాన్ని ఎవరు అందుకుంటారన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. గత శాసనసభలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయనను రాజ్యసభకు ఎన్నుకున్నారు. అప్పుడు రాష్ట్రం ఉమ్మడిగానే ఉండింది. ఇప్పుడు రెండుగా విడిపోయింది. ఇప్పుడు జరిగిన శాసనసభ ఎన్నికల్లో సమీకరణలు కూడా మారిపోయాయి. నేదురుమల్లి రాజ్యసభ సీటు ఇప్పుడు తెలుగుదేశంపార్టీకి దక్కే అవకాశముంది. అనూహ్యంగా రాజ్యసభ బెర్త్ ఖాళీ కావడంతో ఈ పదవి కోసం పలువురు పోటీ పడుతున్నారు. నెల్లూరు లోక్‌సభ నుండి పోటీచేసి చాలా తక్కువ మెజార్టీతో ఓడిపోయిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈ సీటును ఆశిస్తున్నారు. మొన్న ఎన్నికల్లో ఆదాల ఓడిపోయి ఉండొచ్చు. కాని జిల్లాలో ఈ ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ ఈ మాత్రమైనా ఉందంటే ఆదాల వల్లే. ఆయన చేరాకే పార్టీలో ఊపొచ్చింది. కొన్ని స్థానాల్లో అభ్యర్థులు లేని కొరత తీరింది. ఆదాల చేరికతో కోవూరు, ఉదయగిరి నియోజకవర్గాలను గెలవగలిగారు. లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీలో 5అసెంబ్లీలను వైకాపా గెలిచింది. తెలుగుదేశం కేవలం 2అసెంబ్లీలనే గెలిచింది. అయినా లోక్‌సభకు వచ్చేసరికి ఆదాల నువ్వా-నేనా అన్నట్లు పోరాడాడు. ఈ ఎన్నికలతో ఆర్థికంగా ఎంతో నష్టపోయాడు. కాబట్టి ఆయన రాజ్యసభను ఆశించడంలో తప్పులేదు. అదీగాక సీమాంధ్రలో నెల్లూరుజిల్లా పార్టీ బలహీనంగా వుందనేది నిన్నటి ఎన్నికల్లో తేటతెల్లమైంది. కాబట్టి జిల్లాలో పార్టీ పటిష్టత కోసమైనా రాజ్యసభను ఈ జిల్లాకే కేటాయించాల్సివుంది. కాగా ఒంగోలు లోక్‌సభ నుండి ఓడిపోయిన మాగుంట శ్రీనివాసులురెడ్డి, సర్వేపల్లి అసెంబ్లీ నుండి ఓడిపోయిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు కూడా రాజ్యసభను ఆశిస్తున్నారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లోనే సోమిరెడ్డి సీటును ఆశించి రాక నిరాశ చెందారు. పార్టీ పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఎక్కడికీ పోకుండా పోరాడాడు. ఓడిపోతారని ఊహించినా కూడా ధైర్యంగా సర్వేపల్లి నుండి పోటీ చేసి హోరాహోరీగా తలపడ్డాడు. సోమిరెడ్డి రాజ్యసభను ఆశించడంలో తప్పులేదు. జిల్లాలో పార్టీని పటిష్టం చేయడానికి ఇదో మార్గం! మాగుంట శ్రీనివాసులురెడ్డి ఎన్నికలకు ముందే పార్టీలో చేరాడు. నెల్లూరుజిల్లాలో కంటే ప్రకాశంజిల్లాలో ఆయన పాత్ర ఉంటుంది. కాబట్టి ఆయనకు పెద్దగా ప్రాధాన్యత ఉండకపోవచ్చు.

# మొదటిసారి అసెంబ్లీకి...



జిల్లా నుండి ఎన్నికైన పదిమంది శాసనసభ్యులలో 8మంది అసెంబ్లీకి కొత్తవాళ్లు కావడం గమనార్హం. గెలిచిన వారిలో పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణలు మాత్రమే కొంచెం సీనియర్లు. పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి 2004లో కోవూరు నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేయగా, 2009ఎన్నికల్లో కురుగొండ్ల రామకృష్ణ వెంకటగిరి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ ఎన్నికల్లో వాళ్లిద్దరు తప్ప గెలిచిన మిగతా 8మంది కొత్తవాళ్లే! నెల్లూరు నగరం నుండి గెలిచిన వైకాపా ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ మొదటిసారి అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. 2009ఎన్నికల్లో అనిల్ తొలిసారి నెల్లూరు నగరం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. తన కలను ఈరోజు నెరవేర్చుకున్నారు. అలాగే నెల్లూరు రూరల్ వైకాపా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కూడా తొలిసారి అసెంబ్లీకి పోతున్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి 2009 ఎన్నికల్లో కావలి నుండి ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో కావలి నుండి వైకాపా అభ్యర్థిగా విజయం సాధించారు. ఉదయగిరి ఎమ్మెల్యేగా గెలిచిన బొల్లినేని రామారావుకు ఇది మొదటిసారే! 2012 ఉపఎన్నికల్లో ఆయన ఉదయగిరి నుండి తొలిసారి పోటీ చేసి ఓడిపోయారు. సర్వేపల్లి వైకాపా అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆత్మకూరు వైకాపా అభ్యర్థి మేకపాటి గౌతంరెడ్డి, సూళ్లూరుపేట వైకాపా అభ్యర్థి కిలివేటి సంజీవయ్య, గూడూరు వైకాపా అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌లు తొలిసారి ఎమ్మెల్యేలుగా పోటీచేసి గెలిచారు.

# ఆనం ఆల్ అవుట్



***ఏమైంది ఆనం వర్గం... ఏమైపోయాయి ఆనం వర్గం ఓట్లు... పార్టీ ఏదైనా సరే... గుర్తు ఏదైనా సరే... ఆనం ఇంటి పేరున్న వారు నిలబడితే ఓట్లు జలజల రాలు తాయంటారు. మరి ఆ ఓట్లన్నీ ఏమైపోయాయి.***

ఆనం కుటుంబానిది ఆరు దశాబ్దాల రాజకీయ జీవితం. నాటి ఏ.సి.సుబ్బారెడ్డి నుండి నేటి ఏ.సి.సుబ్బారెడ్డి దాకా సాగిన వారి కుటుంబ రాజకీయప్రస్థానంలో ఇప్పుడు చవిచూసిన తీరని ఘోరపరాభవం చరిత్రలో ఎప్పుడూ ఎదురుకాలేదు. ఆనం కుటుంబానికి జయాపజయాలు రెండూ ఉన్నాయి. కనీసం డిపాజిట్ కూడా దక్కని పరాభవం మాత్రం ఇప్పుడే జరిగింది.

ఈ ఎన్నికల్లో ఆనం కుటుంబం నుండి నలుగురు పోటీ చేసారు. ఆత్మకూరు నుండి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరురూరల్ నుండి ఆనం విజయకుమార్‌రెడ్డి, నెల్లూరు నగరం నుండి ఆనం చెంచుసుబ్బారెడ్డిలు కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేయగా ఆనం జయకుమార్‌రెడ్డి మాత్రం నెల్లూరు నగరం నుండి జైసమైక్యాంధ్ర అభ్యర్థిగా పోటీ చేసారు.

ఆత్మకూరు అసెంబ్లీలో మొత్తం 1,63,896ఓట్లు పోల్‌కాగా ఆనం రామనారాయణరెడ్డికి కేవలం 8929ఓట్లు మాత్రమే దక్కాయి. కనీసం డిపాజిట్ కూడా దక్కకుండా పోయింది. నెల్లూరు నగరం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా ఏ.సి.సుబ్బారెడ్డికి కేవలం 3,971ఓట్లు మాత్రమే దక్కగా, జైసమైక్యాంధ్ర పార్టీ అభ్యర్థి ఆనం జయకుమార్‌రెడ్డికి కేవలం 1,607 ఓట్లు మాత్రమే దక్కాయి. ఇద్దరూ డిపాజిట్లు కోల్పోయారు. వీరి ముగ్గురికంటే ఘనంగా నెల్లూరురూరల్ కాంగ్రెస్ అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డి 14,589 ఓట్లు తెచ్చుకుని కొంచెం మెరుగనిపించుకున్నాడు. రాజకీయాలలో గెలుపోటములు సహజమే అయినా ఆనం కుటుంబం ఇంతటి ఘోరపరాజయాల్ని చవిచూస్తుందని ఎవరూ అనుకోలేదు.



## 90తో ఓడి...

# 19000తో గెలిచాడు

***ఓటమి పట్టుదలను పెంచుతుంది. ఓటమి ఓర్పును పెంచుతుంది. గెలవాలనే కసిని పెంచుతుంది. ఐదేళ్లపాటూ ఈ కసితోనే పనిచేసి, పట్టుదలతో ముందుకు సాగి, తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాడు నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్.***

అనిల్ రాజకీయ జీవితం అంతా కూడా ఆరేళ్లలోపే. 2008లో 20వ డివిజన్ కార్పొరేటర్‌గా వున్న తన చిన్నాన్న పోలుబోయిన సుధాకర్ మరణం అనిల్ రాజకీయ ప్రస్థానానికి దారి తీసింది. 20వ డివిజన్‌కు జరిగిన ఉపఎన్నికల్లో అనిల్‌కుమార్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టారు. ఏకపక్షంగా సాగిన ఈ ఎన్నికల్లో అనిల్ వెయ్యికిపైగా ఓట్ల మెజార్టీ సాధించారు. ఈ ఎన్నికతోనే అప్పటి ముఖ్యమంత్రివై.యస్.రాజశేఖరరెడ్డి దృష్టిలో పడ్డాడు అనిల్. 2009 ఎన్నికల్లో జిల్లాలో ఒక సీటును బీసీలకు ఇవ్వాలనే ప్రతిపాదన వచ్చింది. అప్పుడే నెల్లూరు నగరం సీటు కోసం కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నించసాగాడు. కోటంరెడ్డికి చెక్ పెట్టడానికి ఆనం సోదరులు బి.సి.లకు నెల్లూరు నగరం సీటును ఇవ్వాలని వై.యస్. వద్ద ప్రతిపాదించారు. ఆమేరకు వాళ్లు నెల్లూరు నగరం, రూరల్, ఆత్మకూరు బి-ఫారాలను తీసుకున్నారు. ఇక బీసీల కోటాలో రాచాల రవికుమార్‌యాదవ్, చాట్ల నరసింహారావు, పి.అనిల్‌కుమార్‌ల పేర్లను పరిశీలించారు. యువకుడు కావడం, అప్పుడే కార్పొరేటర్‌గా గెలిచి ఉండడంతో అనిల్ అయితే బాగుంటుందని భావించి అతనికే సీటు ఖరారు చేసారు. ఆనం జయకుమార్‌రెడ్డి ఇన్‌ఛార్జ్‌గా అనిల్ ప్రచారం సాగింది. అయితే ఈ ప్రచార సమయంలోనే ఆనంతో అనిల్ విభేదిస్తూ వచ్చాడు. కోటంరెడ్డిని దూరంగా పెట్టాలని ఆనం వర్గం ఆదేశించినా, అనిల్ దానిని లెక్కచేయలేదు. హోరాహోరీగా జరిగిన ఆ ఎన్నికల్లో ప్రజారాజ్యం అభ్యర్థి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి చేతిలో కేవలం 90ఓట్ల తేడాతో ఓడిపోయాడు. అనిల్ ఇక్కడ నుండి ఆనం సోదరులతో విభేదించడం, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైపు చేరడం జరిగిపోయింది. ఆనం కుటుంబం బలమైన రాజకీయాలు నడిపే నెల్లూరులో వారిని వ్యతిరేకించిన బి.సి నాయకుడెవరైనా సరే ఒక్కసారితో సరిపెట్టుకోవాలి. కాని అనిల్ పట్టువీడలేదు. వై.యస్. మరణానంతరం జరిగిన పరిణామాలలో జగన్ పక్షాన నిలిచాడు. ఆయన పెట్టిన పార్టీలో చేరాడు. నెల్లూరు నగర సీటు

(మిగతా 10వ పేజీలో)



# అంతా ఆనం పుణ్యమే!

***రాజకీయాల్లో ఒకరు చేసే పొరపాట్లు ఇంకొకరికి వరంగా మారుతుంటాయి. నిన్నటి ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గం విషయంలో ఆనం రామనారాయణరెడ్డి అనుసరించిన వైఖరివల్లే నెల్లూరు లోక్‌సభ నుండి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు అసెంబ్లీ నుండి మేకపాటి గౌతంరెడ్డిలు గెలవగలిగారు.***

రాష్ట్ర విభజన వల్లే సీమాంధ్ర మొత్తం కాంగ్రెస్‌పార్టీ ఎత్తిపోయినా ఆత్మకూరులో మాత్రం ఆనం రామనారాయణరెడ్డి గెలిచే పరిస్థితి ఉండింది. ఆయన చేసిన అభివృద్ధి పనులు పట్ల గ్రామస్థాయి నాయకులు, ప్రజలు కృతజ్ఞతాభావం చూపించాలనుకున్నారు. అయితే అభివృద్ధి పనులు చేయగానే వాటిని చూసి జనం ఓట్లేసే పరిస్థితి లేదు. ముందు కేడర్‌ను నిలబెట్టుకోవాలి. కాని అసెంబ్లీ ఎన్నికలకంటే ముందు మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలొచ్చాయి. ఆనం రామనారాయణరెడ్డి ఆ ఎన్నికలను పూర్తిగా వదిలేసాడు. దీంతో ఆ ఎన్నికలలో ఎవరూ ఖర్చు పెట్టలేక కేడర్ చెల్లాచెదురైంది. ఆత్మకూరులో పోటీ చేసే విషయమై ఆనం రామనారాయణరెడ్డి స్పష్టంగా చెప్పకపోవడంతో ఆయన వెనుక వున్న కేడర్ ఎక్కువ శాతం గౌతంరెడ్డి వైపు వెళ్లింది. ఇంకొంత కేడర్ తెలుగుదేశం వైపు మళ్లింది. రామనారాయణరెడ్డి పోటీకి దిగకపోతే తెలుగుదేశం తరపున పోటీ చేసేందుకు బొల్లినేని భాస్కర్‌రావు సిద్ధమయ్యారు. ఆయన పోటీలో వుంటే ఆత్మకూరు నువ్వా-నేనా అన్నట్లుండేది. ఒకవేళ గౌతం కొద్ది మెజార్టీతో గెలిచినా ఎంపీకి ఇంత మెజార్టీ వచ్చేది కాదు. ఆదాల గెలిచి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఓడిపోయి ఉండేవాడు. కాని ఆనం పోటీకి దిగినా ఎలక్షన్‌ను గాలికి వదిలేసాడు. సరిగా పట్టించుకోలేదు. మరోపక్క ఆనం రామనారాయణరెడ్డి బలమైన అభ్యర్థి అవుతాడని, ఆయనకు పడే ఓట్లు చీలకూడదనే ఉద్దేశ్యంతో తెలుగుదేశంవాళ్లు బలహీన అభ్యర్థిగా గూటూరు కన్నబాబును నిలబెట్టారు. తీరా ఎన్నికల క్యాంపెయిన్ వచ్చేసరికి ఆనం చేతులెత్తేసాడు. ఎన్నికలను పూర్తిగా వదిలేసాడు. ఆ పక్క చూస్తే కన్నబాబు గట్టిగా పోరాడలేకపోయాడు. దీంతో మేకపాటి గౌతం అనూహ్యంగా బలపడ్డాడు. అసెంబ్లీకి, పార్లమెంటుకు భారీమెజార్టీ వచ్చింది. ఇక్కడ మంచి మెజార్టీ రాబట్టే మేకపాటి రాజమోహన్‌రెడ్డి చావుతప్పి కన్ను లొట్టబోయిన చందంగా గెలిచాడు.

# వెంటాడిన దురదృష్టం

రాజకీయాల్లో కొండంత కృషి వున్నా గోరంత అదృష్టం ఉండాలనే దానికి నెల్లూరుజిల్లా ఫలితాలే ఒక ఉదాహరణ. పార్టీ గెలవకుండా తాము గెలిచినా కూడా అభ్యర్థులకు పెద్దగా సంతోషం వుండదు. కాని పార్టీ గెలిచి అధికారంలోకి వచ్చి తాము ఓడిపోతే మాత్రం అభ్యర్థులు పడే బాధ వర్ణనాతీతం. ఇప్పుడు నెల్లూరు జిల్లాలో అదే జరిగింది. సీమాంధ్రలో అన్నిచోట్లా తెలుగుదేశంకు అనుకూల ఫలితాలు వస్తే నెల్లూరుజిల్లాలో మాత్రం వ్యతిరేక ఫలితాలు వచ్చాయి. ఈ ఫలితాల వల్ల పలువురు మంత్రులయ్యే ఛాన్స్‌ను కోల్పోయారు. సర్వేపల్లి నుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలిచి ఉంటే ఖచ్చితంగా మంత్రి అయ్యుండేవారు. జిల్లాలో సీనియర్ ఆయనే. ఆయనను కాదని ఇంకొకరికి ఇచ్చే పరిస్థితి లేదు. ఇక అత్యంత దురదృష్టవంతుడు కావలి నుండి ఓడిపోయిన బీద మస్తాన్‌రావు. 2009ఎన్నికల్లో గెలిచి ప్రతిపక్షంలో కూర్చున్నాడు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు మాత్రం ఓడిపోయాడు. ఆయనే గెలిచి ఉంటే బి.సి కోటాలో మంత్రి పదవి దక్కేది. చంద్రబాబు ఒకటి కాపు ఒకటి బి.సి... రెండు డిప్యూటీ సీఎంలిస్తానన్నాడు. దానిని ఆచరణలో పెడితే బీదకు ఛాన్స్ ఉండేదేమో! ఇక సూళ్లూరుపేట నుండి పరసారత్నం గెలిచివుంటే ఎస్సీ కోటాలో ఆయనకూ మంత్రి ఛాన్స్ తగిలి ఉండేది. గూడూరు నుండి ఓడిపోయిన డాక్టర్ జ్యోత్స్నలత పరిస్థితీ అంతే. మహిళాఎమ్మెల్యేలు చాలా తక్కువ. ఆమె గెలిచివుంటే మహిళ అనే కాకుండా ఎస్సీ కోటాలో కూడా మంత్రి పదవికి అవకాశముండేది.

## బెంగుళూరులోని మన ప్రాజెక్ట్స్‌కి

# రెండు అంతర్జాతీయ అవార్డులు



ఆవార్డులతో దేవిరెడ్డి కిషోర్‌రెడ్డి

నిర్మాణంలో నాణ్యత, ఇంటీరియర్ డిజైనింగ్‌లో ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేకశ్రద్ధ కనపరుస్తున్న బెంగుళూరులోని నెల్లూరీయుల సంస్థ "మన ప్రాజెక్ట్స్"కి రెండు అంతర్జాతీయ అవార్డులు లభించాయి. ముఖ్యంగా భవన నిర్మాణ సమయంలో సంస్థ తీసుకుంటున్న జాగ్రత్తలు, ఇల్లు సొంతం చేసుకునేవారిని సంతృప్తి పరచడం కోసం తీసుకుంటున్న నిర్ణయాలతో పాటు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన పరిసరాలను రూపొందించడంలో ఈ సంస్థ తీసుకుంటున్న చర్యలకు ఈ అవార్డులు లభించాయి.

నెల్లూరుజిల్లాకు చెందిన దేవిరెడ్డి కిషోర్‌రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్‌గా "మన ప్రాజెక్ట్స్" నిర్మించిన "మన జర్డిన్" నిర్మాణంలో లాండ్‌స్కేప్ మరియు ఆర్కిటెక్చర్‌లో ఉపయోగించిన ఆధునిక పరిమాణాలకు గాను "రెసిడెన్షియల్ ల్యాండ్‌స్కేప్ ఆర్కిటెక్చర్ అవార్డు" లభించగా, ఇదే సంస్థ నిర్మించిన "మన సెల్డన్"లో ఇంటీరియర్‌లో తీసుకున్న జాగ్రత్తలు, అవలంభించిన కొత్త విధానాలకు "బెస్ట్ ఇంటీరియర్ డిజైన్ షో హోమ్ అవార్డు"ను ఆసియా పసిఫిక్ ప్రాపర్టీ అవార్డ్స్‌ల వారు మలేషియా దేశంలోని కౌలాలంపూర్‌లోని హోటల్ షాంగ్రిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో తమ సంస్థకు పలు అవార్డులు వచ్చాయని, అయితే ఈ ఇంటర్నేషనల్ ప్రాపర్టీ అవార్డు కోసం పలు దేశాలు పోటీపడినప్పటికీ తమ సంస్థకు లభించడం గర్వకారణంగా వుందని అన్నారు.

సొంత ఇంటి కలలు కనేవారికి వారు ఊహించిన దానికన్నా ఎక్కువ నాణ్యతతో, వసతులతో ఇల్లు కట్టించి అందించడం మన ప్రాజెక్ట్స్ లక్ష్యమన్నారు. తాము నిర్మించే అన్ని అపార్ట్‌మెంట్ భవన సముదాయాలలో ఎక్స్‌టీరియర్‌లోగాని ఇంటీరియర్‌లో గాని పర్యావరణ పరిరక్షణకి ప్రాముఖ్యత కల్పిస్తూ ఆహ్లాదకర నిర్మాణాలను అందిస్తామని చెప్పారు. కిషోర్‌రెడ్డికీ వారి "మన"టీంకి 'లాయర్' అభినందనలు.



అవార్డులు తెచ్చిపెట్టిన ఇంటీరియర్ డిజైన్



## అత్యాధునిక పరికరాలతో మోహన్‌చౌదరి కుమార్తె...

# 'శ్రీ మల్టీస్పెషాలిటీ' డెంటల్ క్లినిక్



చంద్రబాబుకు జ్ఞాపికనందజేస్తున్న రావి మోహన్‌చౌదరి

హైదరాబాద్ కూకట్‌పల్లిలోని కె.పి.హెచ్.బిలో డిమార్ట్ దగ్గర కాకతీయ సేవాసమితి నెల్లూరు జిల్లా అధ్యక్షులు రావి మోహన్ చౌదరి కుమార్తె డా॥ రావి శిల్ప నేతృత్వంలో నిర్వహించబడే శ్రీ మల్టీస్పెషాలిటీ డెంటల్ క్లినిక్ ఈ నెల15న ప్రారంభమైంది. సీమాంధ్రకు నూతన ముఖ్యమంత్రి కాబోతున్న నారాచంద్రబాబునాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరిల ఆశీస్సులతో ఈ క్లినిక్ ప్రారంభమైందని ఈ సందర్భంగా రావి మోహన్‌చౌదరి తెలిపారు. ఈ క్లినిక్ అనుభ వజ్ఞులైన వైద్యబృందం, అత్యాధునిక పరికరాలతో ప్రతిష్టాత్మకంగా ఉత్తమరీతిలో నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గరికపాటి మోహన్‌రావు, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికపూడి గాంధీ, కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, పలువురు టిడిపి కార్పొరేటర్లు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గొట్టిపాటి సత్యవాణి, బిగసి ఛైర్మెన్ బాలుచౌదరి, సెల్‌కాన్ సియండి వై.గురు, శ్రీ సర్వారాయ షుగర్స్ వైస్ ప్రెసిడెంట్ రావిసుధాకర్‌చౌదరిలు పాల్గొన్నారు.



## మాట నేర్చి... బాట మార్చి...

# ఇంటికి చేరిన పనబాక

- ప్రజలు మెచ్చి అధికారమిచ్చారు
- పార్టీ మెచ్చి మంత్రిని చేసింది
- విభజన తెచ్చి ఇంటికి చేరింది

*రాజకీయాల్లో గెలుపోటములు సహజం. శాశ్వత శత్రుత్వాలూ, చిరస్థాయి మిత్రత్వాలూ అంతంతమాత్రమే. ఎప్పటికప్పుడు మంచిదారి ఎంచుకుంటూ ముందుకు పోతుండడమే నాయకుల లక్షణం. అయితే, తాము ఏ స్థాయిలో వున్నా, ఎంతటి ఉన్నతమైన పదవిలో వున్నా.. ఒకవేళ ఏ పదవిలోనూ లేకున్నా.. ప్రజల సేవే నాయకులకు పరమావధి కావాలి. అలా ఉన్నప్పుడే కానికాలంలో కష్టం ఎదురైనా, అదునైన సందర్భాల్లో అదృష్టం ఒక మంచి అవకాశంగా తనంత తనే వచ్చి చేరుతుంటుందన్నది రాజకీయ విజ్ఞులందరికీ అనుభవైకవేద్యమే.*

జిల్లా రాజకీయరంగాన్ని శాసించిన అనేకమంది నాయకులకూ ఇవన్నీ తెలిసిన విషయాలే. అయితే, పొరపాటునో గ్రహపాటునో కొన్ని సందర్భాల్లో తాము అనుకున్నట్లు జరుగుతుందనే ధీమా వారిలో వచ్చి చేరుతుంటుంది. ఆచరణకు వచ్చేసరికి అందుకు భిన్నంగా జరిగినప్పుడు ఖిన్నులు కావడం తరచూ జరిగేదే. ఇప్పుడు జిల్లాలోని అనేకమంది సీనియర్‌లు అనుకుంటున్న నాయకుల్లో, ముఖ్యంగా ఈ ఎన్నికల్లో ఓటమి పాలైన కాంగ్రెస్ నేతల్లో ఇలాంటి అంతర్మథనమే జరుగుతోంది. 'ఎందుకిలా జరిగింది?..అనేదే వారి మనోవేదన. తాము ఇన్నాళ్లూ నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ మరీ ఇంత ఘోరంగా పరాజయం పాలవడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. జిల్లాలో గతంలో ఎంతో మంచి నేతగా పేరుతెచ్చుకున్న శ్రీమతి పనబాక లక్ష్మికి కూడా ఈ సారి ఓటమే ఎదురైంది. కాంగ్రెస్ పార్టీ తీసుకున్న విభజన నిర్ణయం రాష్ట్రంలో అనేకమంది నాయకుల పాలిట శాపమైంది. మరోవైపు అటు మోడీ మహాజనప్రభంజనం, ఇంకోవైపు తెలుగుదేశం పార్టీ ఊపూ జత కలిశాయి. దీంతో, కాంగ్రెస్‌కు ఎదురుగాలి తప్పలేదు. దేశవ్యాప్తంగా ఎందరో ఉద్దండులైన నాయకులు సైతం ఈసారి డీలా పడిపోయిన పరిస్థితి. బిజెపి గతంలో ఎన్నడూ లేనంత వూపుతో వచ్చి అత్యధికస్థానాల్లో కమలం జెండాను ఎగరేసింది. ఇదంతా నిజమా?.. కలా?.. అన్నట్లుంది అనేకమంది కాంగ్రెస్ నాయకులకు. గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లాలో స్థానిక ఎన్నికల్లో సైతం అనేకస్థానాల్లో కాంగ్రెస్‌కు అసలు అభ్యర్థులే కరువవడంతో, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పరిస్థితి ఎలా వుండబోతోందో ముందుగానే చెప్పినట్లయింది. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు నేతలు ఈసారి ఎన్నికల్లో తమ ఓటమి ఖాయమనే నిర్ణయానికి వచ్చినా, మరీ ఇంత ఘోరంగా పలుచోట్ల డిపాజిట్‌లు సైతం రాక, దారుణ పరాజయాన్ని ఎదుర్కోవడం వారికి నిద్ర లేకుండా చేస్తోంది. జిల్లాకు సంబంధించినంతవరకూ పలువురు నాయకులు ఇప్పుడు ఇదే ఆవేదనలో వున్నారు. అందులోనూ, రాజకీయరంగంలో ఒక మంచి నేతగా, దళితనేతగా వున్న శ్రీమతి పనబాక లక్ష్మికి కూడా ఈ ఎన్నికలు సంకటస్థితినే తెచ్చిపెట్టాయి. రాజకీయాల్లో తనకంటూ గాడ్‌ఫాదర్‌లు ఎవరూ లేకుండా, ఎలాంటి పొలిటికల్ డాన్‌లతో నిమిత్తం లేకుండా, జిల్లా రాజకీయరంగంలో తనదంటూ ఒక వర్గాన్ని, ప్రజాభిమానాన్ని సాధించుకుని, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి రాజకీయాల్లో సైతం చక్రం తిప్పిన ఆమె, బాపట్ల నుంచి పోటీలోకి దిగడమే ఆమెకొక అగ్ని పరీక్ష అయింది. రాజకీయాల్లో అంచలంచలుగా ఎదుగుతూ కేంద్ర మంత్రి పదవిని సైతం సాధించి, తనదంటూ ఒక ప్రత్యేకతను సాధించుకున్న ఆమె, పరాజయం పాలుకావడం ప్రజలకు, ముఖ్యంగా దళితప్రజలకు వేదన కలిగించే విషయమే. అందులోనూ కేంద్ర మంత్రి పదవి అంటే మాటలు కాదు. ఒక్కోసారి ఇది మహామహా నేతలకు కూడా సాధ్యమయ్యే పని కాదు. మాజీముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కూడా కేంద్ర మంత్రి పదవి కోసం ఆశించినా ఆ పదవిని పొందలేకపోయారు. గతంలో, ఈ జిల్లా నుంచి దివంగత నేత డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, ఆ తర్వాత బిజెపి జాతీయ నాయకులు ముప్పవరపు వెంకయ్యనాయుడు కేంద్రమంత్రులుగా వుండి అటు దేశపాలనలోనూ, ఇటు రాష్ట్రం, జిల్లాస్థాయిల్లోనూ మంచి ప్రగతికి బాటలు వేశారు. వారిద్దరి తర్వాత, కేంద్రమంత్రి పదవిని సాధించింది శ్రీమతి పనబాక లక్ష్మే. కాంగ్రెస్‌పార్టీ నుంచి బెజవాడ గోపాలరెడ్డిగారి తర్వాత, రెండవ నేతగా కేంద్రమంత్రి పదవిని సాధించిందీ, బెజవాడ గోపాలరెడ్డిగారి కంటే, ఎక్కువ కాలం పదవిలో వున్నదీ శ్రీమతి పనబాకే. ఈ జిల్లా నుంచి తొలి దళిత మంత్రిగా పదవిని సాధించి ఎంతో ఖ్యాతిని కూడా పొందారామె. దాదాపు పదేళ్ళపాటు ఆమె కేంద్రమంత్రి పదవిలో వుండడం ఆమెకు కలసివచ్చిన గొప్ప అదృష్టం. ప్రజల్లో ఆమెకు వున్న అభిమాన బలంతో పాటు, కాంగ్రెస్ అధిష్టానంతో వున్న సాన్నిహిత్యం ఆమెకు బాగా కలసివచ్చాయి. తొలిసారిగా ఆమె పదవిలోకి వచ్చినప్పుడు ప్రజాసమస్యల పట్ల బాగా స్పందించారు. జిల్లాలో కూడా ప్రగతి పనులను పరుగులు పెట్టించారు. పని చేసే లక్ష్మిగా అందరూ అభిమానంతో పిలుచుకునేలా వ్యవహరించారు. తనకు కేంద్రస్థాయిలో ఇంతటి అరుదైన గౌరవాన్ని తెచ్చిపెట్టిన ప్రజల పట్ల ఆమె ఎంతో అభిమానంగా వుండేవారు. తొలి అయిదేళ్ళలో ఆమె అటు జాతీయస్థాయిలోనూ, జిల్లాస్థాయిలోనూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు శ్రీకారం చుట్టారు. అయితే, ఆ తర్వాత రెండవసారి కేంద్రమంత్రిగా పదవిని పొందిన తర్వాత, మునుపటి కంటే రెట్టించిన ఉత్సాహంతో ప్రజల సమస్యలు తీర్చాల్సిన ఆమె, జాతీయస్థాయి రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారే తప్ప, తనను ఆదరించిన ప్రజల పట్ల, ప్రజల ఆకాంక్షల పట్ల అనుకున్నంతగా స్పందించలేకపోయారే.. అని ప్రజల ఆవేదన. ముఖ్యంగా, రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్ పార్టీలోని అనేకమంది ముఖ్యనేతలు కూడా కాంగ్రెస్‌పార్టీ తీసుకున్న నిర్ణయం సముచితం కాదనీ, ఇది అన్యాయమనీ స్పష్టం చేసిన సందర్భాలు అనేకం. విభజన అంటూ జరిగితే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు భవిష్యత్ వుండదనీ అనేకమంది నాయకులు చెప్పారు కూడా. విభజన వద్దంటూ ప్రజలు వెల్లువలా రోడ్లమీదికి వచ్చి ఆందోళనలు చేసిన సందర్భాలూ బోలెడు. అయితే, ఇంత జరుగుతున్నా ఈ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పనబాక, ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా, విభజనకు మద్దతు పలకడం పట్ల ప్రజలు ఆశ్చర్యానికి గురవడమే కాక, మరింత ఆవేదన చెందారు కూడా. ఎంతో అభిమానంతో తాము గెలిపించి, ఢిల్లీస్థాయికి వెళ్లేలా ఆశీర్వదించినా, తీరా జాతీయ స్థాయికి వెళ్ళాక, ప్రజల ఆకాంక్షలను (మిగతా 8వ పేజీలో)






## కాంగ్రెస్‌కు తగిన శాస్తి

ప్రజల మనసులతో ఆడుకుంటే ఫలితాలు ఎలా ఉంటాయో కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా గుర్తించాలి. చాలా మొండిగా, ఏక పక్షంగా, పక్షపాత ధోరణితో రాష్ట్ర విభజనకు పాల్పడిన కాంగ్రెస్‌కు రాష్ట్ర ప్రజలు చెప్పుతో కొట్టినట్లు సమాధానం చెప్పారు. తెలంగాణ ప్రజలు కూడా ఆదరించకపోవడంతో కాంగ్రెస్‌కు సిగ్గొచ్చినట్లయ్యింది. కాంగ్రెస్‌ను ఈ దేశం నుండే తరిమేయాలి.

సి.రాజీవి, నెల్లూరు.

## కీలకచట్టాలు తేవాలి

దేశాభివృద్ధికి ప్రధాన అవరోధంగా వున్న కొన్ని అంశాలలో ఎన్డీఏ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. కామన్ సివిల్‌కోడ్‌ను అమలు చేయాలి. గోవధ నిషేధం విధించాలి. మతపరమైన ప్రచారాలను నిలువరించి అందరిచేత పని చేయించాలి. అన్ని రంగాలలో ఉత్పాదకతను పెంచాలి. అభివృద్ధి, ఉపాధికల్పనకు అధిక ప్రాధాన్యత నివ్వాలి.

వి.కృష్ణసాగర్, మేర్లపాక.

## చంద్రబాబుకు అభినందనలు

ఈసారి కూడా తెలుగుదేశంకు అధికారం కష్టమే అన్న పరిస్థితుల నుండి ఆ పార్టీని అధికారపీఠం వైపు నడిపిన చంద్రబాబునాయుడుకు అభినందనలు. చంద్రబాబు అనుభవశాలి. ఆయన సీఎం అయితేనే సీమాంధ్ర అభివృద్ధి సాధ్యమవుతుందనుకున్న ప్రజలు ఆయనకే పట్టం కట్టారు. ఈ అవకాశాన్ని చంద్రబాబు సద్వినియోగం చేసుకోవాలి. కులాలు, మతాల పట్టింపులను పక్కనపెట్టి అభివృద్ధిపై దృష్టిపెట్టాలి.

శిరిగిరి వాసు, నెల్లూరు.

## విశ్వసనీయత ఫలించలేదు

విశ్వసనీయత, తెలుగుజాతి ఆత్మగౌరవం అంటూ ఎన్ని దొంగ ఏడుపులు ఏడ్చినా జగన్‌ను ప్రజలు నమ్మలేదు. తన తల్లి, చెల్లి ద్వారా ప్రచారం చేయించి సెంటిమెంట్‌ను పండించాలనుకున్న జగన్ ఫ్యాన్ రెక్కలు విరిగిపోయాయి. విజయమ్మను కూడా వైజాగ్ ప్రజలు నమ్మలేదు.

ఎస్.జె.కృష్ణ, నెల్లూరు.

## 'ప్రభా'తం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 60ఏళ్ల తర్వాత కూడా కాంగ్రెస్‌పార్టీ పేదరికం గురించి మొసలి కన్నీళ్లు కారుస్తూ దేశంలో పేదరికాన్ని నిర్మూలిస్తామని చెబుతుంటే ప్రజలు చెవుల్లో పూలుపెట్టుకుని వినలేదు, అవినీతి కుంభకోణాలతో లక్షల కోట్లు పోగేసుకుంటూ ఈ దేశంలో సమర్థవంతమైన పాలన అందించేది మేమేనంటూ కాంగ్రెస్‌పార్టీ వాళ్లు ఊదరగొడుతుంటే ప్రజలు మౌనంగానే విన్నారు. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులను వెనకేసుకొస్తూ దేశంలో పుట్టి, ఈ దేశభక్తితో పెరుగుతున్న వారిలో అభద్రతాభావం కల్పిస్తుంటే అస్సామీలు తమ కొకరోజు అనేది వస్తుందని ఎదురుచూసారు. పండిట్‌లందరినీ తరిమేసి జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని ఒక వర్గం వారికే రాసిచ్చేసిన కాంగ్రెస్ నిర్వాకానికి బుద్ధిచెప్పే రోజు కోసం ఆ రాష్ట్ర పండిట్‌లు కూడా ఎదురుచూసారు. రాష్ట్ర విభజన పేరుతో తమను మానసిక క్షోభకు గురిచేసిన కాంగ్రెస్‌పార్టీకి పాలరాతి సమాధి కట్టేరోజు కోసం ఆంధ్రా ప్రజలు వేయికళ్లతో ఎదురుచూసారు. అన్నింటికి మించి దేశానికి పెద్ద అరిష్టంలా తయారైన కాంగ్రెస్‌పార్టీని దేశం నుండి వెళ్లగొట్టగలిగే వీరుడు, ధీరుడు నరేంద్ర మోడీ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టేరోజు కోసం కోటానుకోట్ల కళ్లు ఎదురుచూసాయి.

విత్తనం మొక్కై కాలక్రమంలో మహావృక్షంలా ఎదుగుతుంది. కాని కాంగ్రెస్‌పార్టీ అనే దాని చరిత్రలో విత్తనం లేదు, మొక్క లేదు. అది ప్రారంభంతోనే మహావృక్షంలా వచ్చింది. అలా మహావృక్షంలా ఆ పార్టీని నిలబెట్టిన ఘనత మహాత్మా గాంధీ, పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ, శ్రీమతి ఇందిరాగాంధీలదైతే, ఆ మహావృక్షాన్ని మొక్కస్థాయికి దిగజార్చిన ఘనత శ్రీమతి సోనియాగాంధీకి దక్కుతుంది. నిజంగా చనిపోయిన వారి ఆత్మలు ఉండడం అనేది నిజమే అయితే ఈరోజు దేశంలో కాంగ్రెస్‌కు పట్టిన దుర్గతిని చూసి గాంధీ, నెహ్రూ, ఇందిరమ్మల ఆత్మలు ఘోషిస్తుంటాయి. తమతో పాటే కాంగ్రెస్ కూడా చచ్చిపోయి వుంటే బాగుండనుకుంటాయి. ఈరోజు దేశంలో కాంగ్రెస్‌పార్టీ అంతలా దిక్కులేని చావు చచ్చింది. అది కూడా ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చిన నరేంద్ర మోడీ అనే వ్యక్తి చేతిలో. కాంగ్రెస్ పార్టీ మీద ప్రజలు ఎంతగా అసహ్యం పెంచుకున్నారు, ఎంతగా విరక్తి చెందారనేది ఆ పార్టీ కొచ్చిన సీట్లను బట్టి చెప్పొచ్చు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దాదాపు 55ఏళ్లపాటూ ఈ దేశాన్ని ఏలిన కాంగ్రెస్‌పార్టీకి ఈ ఎన్నికల్లో కేవలం 44సీట్లు వచ్చాయంటే ఇంతకంటే సిగ్గుచేటు ఉంటుందా? 29రాష్ట్రాలలో పోటీ చేసిన కాంగ్రెస్‌కు 44సీట్లొస్తే ఒకే ఒక రాష్ట్రంలో పోటీ చేసిన అన్నాడిఎంకెకు 37సీట్లు వచ్చాయి. రెండు పార్టీలకు మధ్య సీట్ల తేడా ఏడు సీట్లే. ఒక జాతీయ పార్టీకి ఒక ప్రాంతీయ పార్టీకి తేడా ఏముంది. రాజకీయాలలో గెలుపోటములు సహజమే కావచ్చు. కాని ఈనాటి కాంగ్రెస్ ఓటమి సహజమైనది, సామాన్యమైనది కాదు. ఆ పార్టీ చేసిన తప్పుకు దేశ ప్రజలు విధించిన యావజ్జీవశిక్ష ఇది.

2004లో అధికారంలోకి వచ్చిన యూపిఏ ప్రభుత్వం దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏ దశలోనూ పనిచేయలేదు. ప్రజల మనోభావాలను పక్కనపెట్టేసి ప్రతి దశలోనూ తమ భావాలను ప్రజలపై రుద్దారు. తొలి 5ఏళ్లలో పెద్ద ప్రభావవంతంగా మన్మోహన్ సర్కార్ పనిచేయకపోయినా 2009లో ప్రజలు మరో అవకాశాన్నిచ్చారు. 2004లో ఈ దేశ ప్రజలు అలాంటి అవకాశాన్ని వాజ్‌పేయికి మాత్రం ఇవ్వలేదు. ఇచ్చి ఉంటే ఈరోజు దేశ ప్రగతి ఇంకోరకంగా వుండేది.

కాని ప్రజలు తనకు రెండోసారిచ్చిన అవకాశాన్ని యూపిఏ సర్కార్ సద్వినియోగం చేసుకోలేదు. వరుసబెట్టి కుంభకోణాలకు తెరలేపారు. అంతకుముందు వందల కోట్లలో మాత్రమే జరిగే కుంభకోణాలు యూపిఏ-2లో లక్షల కోట్లకు చేరాయి. ఎన్నో అవినీతి కుంభకోణాలు వెలుగుచూసాయి. స్వయంగా పార్టీ అధినేత్రి అల్లుడే హర్యానాలో భూకుంభకోణంలో ఇరుక్కున్నాడు. నీతి నిజాయితీలకు ప్రతీకగా నిలిచే ప్రధాన మంత్రిలో చలనం లేదు. కుంభకోణం బాధ్యులపై చర్యలు లేవు. పదేళ్ల అధికారం వెలగబెడితే దేశాభివృద్ధి కోసం చెప్పుకోదగ్గ ఏ ఒక్క కార్యక్రమం చేపట్టిన దాఖలాలు లేవు. కేంద్ర కేబినెట్ సహచరులు కూడా మన్మోహన్‌సింగ్‌కు తగ్గట్లే తయారయ్యారు. ఒక్కరికీ మాట్లాడడం చేత కాదు. నోరుతెరిస్తే వివాదాస్పద వ్యాఖ్యలే! లౌకికవాదం పేరుతో వీళ్లే కరుడుగట్టిన మతవాదులయ్యారు. ఒక వర్గం ఓట్ల బ్యాంకుల కోసం మతాధిపతుల గడపలు తొక్కారు. యూపిఏ హయాంలో ద్రవ్యోల్బణం విలయతాండవం చేసింది. పెరిగిన ధరలు ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపించాయి. మొత్తంమీద చూస్తే యూపిఏ పదేళ్ల పాలన వల్ల అభివృద్ధి పరంగా దేశం 20ఏళ్లు వెనక్కిపోయింది. 1947లో బ్రిటీషోళ్ల నుండి స్వాతంత్ర్యం వస్తే ప్రజలు ఎంతగా ఆనందించారో, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుండి దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని అంతగా సంబరపడ్డారు. కాశ్మీర్‌ను మొదలుకొని కన్యాకుమారి వరకు కాంగ్రెస్‌పార్టీ ధ్వంసమైంది. ఉత్తరాదిలో ఊడ్చుకుపోయింది. దక్షిణాన కూడా ప్రజలు కాంగ్రెస్‌ను దంచేసారు. ఈశాన్య రాష్ట్రాలలోనూ ఊడ్చేస్తున్నారు. పశ్చిమ రాష్ట్రాలలో పగతీర్చుకున్నారు. కాంగ్రెస్ ఇప్పుడు జీవశ్చవం. ఇది ఇక ఎన్నేళ్లకు కోలుకుంటుందో?

### ఎప్పటికి కోలుకుంటుందో?



2004లో అధికారంలోకి వచ్చిన యూపిఏ ప్రభుత్వం దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏ దశలోనూ పనిచేయలేదు. ప్రజల మనోభావాలను పక్కనపెట్టేసి, తమ భావాలను ప్రజలపై రుద్దారు. తొలి 5ఏళ్లలో ప్రభావవంతంగా మన్మోహన్ సర్కార్ పనిచేయకపోయినా 2009లో ప్రజలు మరో అవకాశాన్నిచ్చారు.

## 'అంతర్'జాతీయం

- పశ్చిమబెంగాల్ నుండి తమ పార్టీ తరపున విజయం సాధించిన 34మంది ఎంపీలతో లోక్‌సభలో ప్రధానపాత్ర పోషిస్తామని, ప్రజాప్రయోజనాల కోసం పోరాడుతామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. బెంగాల్‌లో తమపై సాగుతున్న దుష్ప్రచారానికి వ్యతిరేకంగా ప్రజలు తీర్పిచ్చారని ఆమె పేర్కొన్నారు.
- కేంద్రంలో యూపిఏ కూటమికి మద్దతిచ్చిన పార్టీలన్నీ ఈ ఎన్నికలో దెబ్బ తిన్నాయని బిఎస్పీ అధ్యక్షురాలు మాయావతి పేర్కొన్నారు. మతతత్వ శక్తులను అడ్డుకునేందుకు యూపిఏకు మద్దతిచ్చిన పార్టీలన్నీ ప్రజాగ్రహానికి గురయ్యాయని, దీనికి బీజేపీ విజయమే ఉదాహరణగా చెప్పారు.
- ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో 2014 సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా ముగించిన కేంద్ర ఎన్నికల సంఘానికి అంతర్జాతీయంగా ప్రశంసలు అందాయి. భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ఎన్నికల సంఘాన్ని ప్రత్యేకంగా అభినందించారు.
- భారత కాబోయే ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్‌లను తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఫోన్‌లో అభినందించారు. అలాగే తమిళనాడులో విజయం సాధించినందుకు వారు కూడా ఆమెను అభినందించారు.
- ఎన్నికల ఫలితాలు వెలువడిన మే 16వ తేదీన ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ 45కోట్ల హిట్లు పొందింది. దేశంలో ఇంతవరకు ఏ ప్రభుత్వ, ప్రైవేట్ వెబ్‌సైట్ కూడా ఒకే రోజులో ఇన్ని హిట్లను పొందలేదు.
- ఈ నెల 19వ తేదీన కొలంబియాలో బస్సులో మంటలు చెలరేగి 31మంది పిల్లలు ఆహుతైపోయారు. మరో 25మంది గాయపడ్డారు. చర్చిలో ప్రార్థనలకు వెళ్ళివారు తిరిగివస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.
- రోడ్ల మీద నడపడమే కాదు ఆకాశంలోనూ విహరించగలిగే బైక్‌ను అమెరికాకు చెందిన 'ఏరోఫెక్స్' అనే కంపెనీ తయారుచేస్తుంది. 2017లో ఈ బైక్‌ను విడుదల చేస్తామని ఆ సంస్థ వెల్లడించింది.
- క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించే అత్యంత సూక్ష్మగ్రాహక చిప్‌ను స్పెయిన్‌లోని 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ పొటానిక్ సైన్సెస్'కు చెందిన శాస్త్రవేత్తల బృందం రూపొందించింది. క్యాన్సర్ ప్రమాదాన్ని చాలా తొందరగా కనిపెట్టడానికి ఈ చిప్ ఉపయోగపడుతుంది.
- ఆరు నెలలుగా ప్రజాందోళనలతో అట్టుడుకుతున్న థాయ్‌లాండ్‌ను ఆ దేశ సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. దేశంలో మార్షల్‌లా విధించింది. తమ చర్యపై ప్రజలు భయపడాల్సిందేమీ లేదని, తమ రోజువారీ కార్యకలాపాలను యధావిధిగా నిర్వహించుకోవచ్చునని సైన్యం సూచించింది.

## వార్త వ్యాఖ్య

వార్త :- జగన్ సముద్రాలనూ మింగేసేవాడు. – డి.ఎల్.రవీంద్రారెడ్డి.
వ్యాఖ్య :- ***ఓడిపోయాడు కదా... ఎన్నయినా అంటారు.***

వార్త :- చంద్రబాబుకు మంచి భవిష్యత్తు. – మాజీప్రధాని దేవేగౌడ.
వ్యాఖ్య :- ***మీవల్లే... లేకుంటే 1996లో మీ బదులు ఆయన ప్రధానై వుంటే ఇప్పుడు మీలానే ఉండేవాడు.***

వార్త :- ఎన్నికల్లో ఓటమికి నాదే బాధ్యత. – జయప్రకాశ్ నారాయణ.
వ్యాఖ్య :- ***గెలిచున్నా మీ క్రెడిటే...***

వార్త :- మావోయిస్టులపై నిషేధాన్ని ఎత్తేయాలి. – సీపీఐ నారాయణ.
వ్యాఖ్య :- ***జరగని పనుల గురించే ఎక్కువ మాట్లాడడం మీ హాబీనా?***

వార్త :- నా పదవీకాలం తెరచిన పుస్తకం. – మన్మోహన్ వెల్లడి.
వ్యాఖ్య :- ***అందులో చదువుకోవడానికేమీ లేదుగా!***

వార్త :- తప్పిదాలు ఉంటే క్షమించండి. – బొత్స.
వ్యాఖ్య :- ***ఉంటే ఏంటి... చేసినవన్నీ అవేగా!***

వార్త :- ప్రజలు అభివృద్ధిని చూడలేదు. – కోట్ల.
వ్యాఖ్య :- ***మీ పార్టీ ప్రజల మనసులను చూడలేదు.***

వార్త :- నేను ఇష్టపడే అతికొద్దిమంది నేతల్లో మీరొకరు. – మన్మోహన్‌తో ఒబామా.
వ్యాఖ్య :- ***అంతగా ఇష్టపడితే మీ దేశానికే తీసుకుపోయి ఉండాల్సింది.***

వార్త :- నిన్న సర్కార్ లేదు... నేడు ప్రతిపక్షం లేదు. – బీజేపీ నేత వెంకయ్య.
వ్యాఖ్య :- ***మీకు చాలా బాధగా ఉన్నట్లుందే!***

వార్త :- జగన్, కేవీపీలను జైలుకు పంపాలి. – వి.హెచ్.
వ్యాఖ్య :- ***సోనియాను కూడా ఎక్కడికి పంపాలో చెప్పండి.***

వార్త :- భాజపా సర్కార్‌ను నడిపేది ఆరెస్సెస్సే. – ప్రకాశ్ కారత్.
వ్యాఖ్య :- ***సోనియాలా ఒక వ్యక్తి మాత్రం నడపరుగా!***

వార్త :- హామీలపై వెనక్కి వెళ్లను. – చంద్రబాబు.
వ్యాఖ్య :- ***అలాగని ముందుకెళ్లే పరిస్థితీ లేదు.***

వార్త :- దావూద్ ముఠాకు మోడీ దడ.
వ్యాఖ్య :- ***మళ్లీ కాంగ్రెస్సే వచ్చుంటే ఆయనకు హ్యాపీగా ఉండేదేమో!***




## వృక్షోరక్షతి రక్షితః

# కూలుతున్న చెట్లు... పర్యావరణానికి తూట్లు!

**చెట్టు** చేసే సహాయం మనిషి అందుకుంటాడేకాని దానిపట్ల కృతజ్ఞత కలిగి వుండడమన్నదే లేదు. ఎవరో, ఎక్కడో నూటికో కోటికో ఒక్కరు తప్ప చెట్లపట్ల ప్రతి ఒక్కరు నిర్లక్ష్యధోరణిని ప్రదర్శిస్తుండడంతో పర్యావరణం పరిస్థితి తల్లక్రిందులై దాని ఫలితం ప్రస్తుతం మనం అనుభవిస్తున్నాం. ఒకప్పుడు భారతదేశాన్ని జనరంజకంగా పాలించిన అశోకుడు చెట్ల పట్ల కృతజ్ఞత కలిగి వున్నాడు కాబట్టే రహదారుల వెంబడి మొక్కలు నాటించారు. అందుకే ఇప్పటికీ ఆ కీర్తి నిలిచిపోయింది. అవి బాటసారులకు నీడనిచ్చాయి. ఫలాలనిచ్చాయి. భారతదేశం సస్యశ్యామలంగా వెలుగొందింది. కాని నేడు రహదారులను బాగా వెడల్పు చేస్తున్న మన పాలకులు, వాటి వెంబడి వుండే వృక్షాలను తొలగించారేకాని బదులుగా అటువంటి నీడనిచ్చే చెట్లుగా మారే మొక్కలను పెంచడం లేదు. రహదారి మధ్యలో వుండే డివైడర్లపై చిన్నపాటి పూలమొక్కలను నాటించారు. అవి చూడడానికి అందంగా వుండొచ్చేమో కాని పెద్ద చెట్లు ఇచ్చే నీడను ఇయ్యవు. ఫలాలనివ్వవు. అందుకే మండే ఎండలు కాసే ఈ కాలంలో ప్రయాణం చేయాలంటేనే భయమేసిపోతోంది. దారి వెంబడి ఒక్క నీడనిచ్చే చెట్టే లేకపోతే వేడెక్కిన వాహనాలలో ఎంత దూరం ప్రయాణించగలం. కాసేపన్నా సేద దీరడానికి ప్రయాణం మధ్యలో ఏదో ఒక చెట్టు కింద ఆగడామంటే మచ్చుకు కూడా కనిపించని పరిస్థితి. దాంతో పాటు వేడి గాలుల ప్రభావంతో వడదెబ్బ తగిలి ఎక్కువమంది ప్రాణాలు కోల్పోతుండడం కూడా ఇప్పుడు కనిపిస్తోంది. ఇప్పుడు పొలాల్లో కూడా గెనాలు, దిబ్బలు మీద చెట్లను వుంచకుండా కొట్టేస్తుండడం కనిపిస్తోంది. ఇంతకు ముందు రోజుల్లో గెనాల మీద తాటిచెట్లు, దిబ్బల మీద వేప, మర్రి, జువ్వి చెట్లు తప్పకవుండేవి. ప్రస్తుతం వాటికి కూడా చెల్లు చీటీ రాసేస్తున్నారు. అదేమంటే పొలాల్లో పారే నీళ్ళు ఆ చెట్లు తాగేస్తున్నాయంట, పైరుకు సరిపోవడం లేదంట. ఇదేమి మాయో కదా! ఒక పక్క సైన్సు అభివృద్ధి చెందింది అనుకుంటాం కాని, ఆ మాటకు అర్ధం ఇదేనా అనిపిస్తోంది. సైన్సు అభివృద్ధి ఫలాలు ఇవేనా అనిపిస్తోంది. సైన్సు అభివృద్ధి చెందితే ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలి. ప్రభుత్వంలో ప్రకృతి పట్ల జాగురూకత వుండాలి. పర్యావరణ రక్షణకు తగ్గట్టు చర్యలు చేపట్టాలి. కాని అలా జరగడంలేదు కదా! అందుకే మండే ఎండలు పెరిగిపోతున్నాయి. వాయు కాలుష్యం, నీటి కాలుష్యం పెరిగిపోయి మనిషిపై మూకుమ్మడిగా అవి దాడి చేస్తుండడం, దాని ఫలితం మనమందరం అనుభవిస్తుండడం గమనించాల్సిన విషయం. ఇప్పటికైనా మేలుకుందాం. "వృక్షో రక్షతి రక్షిత" అన్న ఆర్యోక్తిని గమనంలో వుంచుకొని చెట్లను కాపాడుకుందాం. ప్రభుత్వాన్ని మేల్కొలుపుదాం.

# శ్రీ నేతాజీలో ఫేర్‌వెల్



నెల్లూరు శ్రీనివాస అగ్రహారంలోని శ్రీ నేతాజీ పైలట్ హైస్కూలు నందు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష వ్రాసే విద్యార్థులకు ఫేర్‌వెల్ మీట్ ఈనెల 20న జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గండిపాళెం ఎ.పి.గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంగయ్య నెల్లూరు ఏ.పి.(మైనారిటీ) గురుకుల పాఠ శాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ నాగరాజు, తుమ్మలపెంట ఎ.పి.గురుకుల పాఠశాల రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ జయరామయ్య హాజరై విద్యార్థులకు విలువైన సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా వెంగయ్య, నాగరాజు, జయరామయ్యలను స్కూలు ప్రిన్సిపాల్ ఎం.వి.సుబ్బారెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించారు. పాలిటెక్నిక్ మోడల్ టెస్టులలో మంచి మార్కులు సాధించిన 15మంది విద్యార్థులకు ప్రథమ బహుమతి 2000రూ॥లు, ద్వితీయ బహుమతి 1500/-, తృతీయ బహుమతి 1000/-లు, నాలుగవ బహుమతి 500/-లు, ఐదవ బహుమతి 300రూ॥లు అతిథుల ద్వారా అందజేశారు.

ఈ సందర్భంగా ఎం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ నెల్లూరులో పేరొందిన 10స్కూళ్ళలో నేతాజీ స్కూలు కూడా ఒకటిగా వెలుగొందుతూ ఉండన్నారు.

# అటకెక్కి కూర్చున్న పండ్ల ధరలు



అనుకున్నదే అయినట్టు డీజిల్ ధర పెరగడంతో సరుకులు ధరలు కూడా పెరిగాయి. అన్నిటికంటే ముందుగా పండ్ల ధరలు రాకెట్లలా దూసుకెళ్ళాయి. ఏం కొనేటట్టు లేవు, తినేటట్టు లేవు వాటి ధరలు వింటుంటే. అంతేకాదు పండ్ల దిగుబడి తగ్గిందో ఏమో, కొన్ని రకాల పండ్ల ధరలు గత ఏడాదికంటే చాలా ఎక్కువ పలుకుతున్నాయి. దీనికితోడు పండ్లను అమ్మేవాళ్ళు తూకంలో మోసానికి పాల్పడుతుండడంతో సామాన్యుడు వాటిని కొనడానికి భయపడుతున్నాడు. అరటిపండ్లు డజన్ 50రూ॥ల నుంచి 60రూ॥లు, ఒక్క దానిమ్మ పండు 40రూ॥లు, వేసవికాలంలో మహారాజాలాగా వెలిగే మామిడిపళ్ళు కిలో 50రూ॥లు, 60రూ॥లు, ద్రాక్ష కిలో 80రూ॥ల నుంచి 100రూ॥లు పలుకుతున్నాయి. గత వేసవిల విరివిగా లభించిన గజనిమ్మలు ఇప్పుడు తక్కువగా లభిస్తుండడం, కిలో రూ॥50 నుంచి 60రూ॥లు చెబుతుండడం జరుగుతోంది. ఏం చేద్దాం కలిమాయ.

# చింతా చీటీ చినిగింది

## 33,333 ఓట్లతో ఫ్యాన్సీ నెంబర్ కొట్టాడు



రాష్ట్ర విభజన సమయంలో సమైక్యవాదులకు మద్దతు కాదు కదా, కనీసం వారికి ముఖం కూడా చూపించని మాజీ ఎంపీ చింతా మోహన్ చీటీని అడ్డంగా చించేసారు తిరుపతి లోక్‌సభ ఓటర్లు. కాంగ్రెస్ అధిష్టానం కాళ్ళు ఒత్తుతూ సమైక్య ఉద్యమానికి ద్రోహం తలపెట్టినందుకు గాను ఆయనకు తగిన శాస్తే జరిగింది.

తిరుపతి లోక్‌సభ నుండి ఆరుసార్లు గెలిచిన రికార్డును తన సొంతం చేసుకున్న చింతా మోహన్ ఈ ఎన్నికల్లో మాత్రం డిపాజిట్‌ను కోల్పోయారు. ఈ ఎన్నికల్లో ఆయనకు వచ్చింది 33,333 ఓట్లు మాత్రమే. అయితే ఆయన అదృష్టమో ఏమో ఓట్లు కూడా ఫ్యాన్సీ నెంబర్ మాదిరిగా ఒకే అంకెతో రావడం విశేషం. 1984, 1989, 1991, 1998, 2004, 2009లలో చింతా మోహన్ తిరుపతి ఎంపీగా పనిచేసారు. 1999లో మాత్రం ఓడిపోయారు. ఆరుసార్లు ఎంపీగా గెలిచిన ఆయన రికార్డులో భారీమెజార్టీలు కూడా ఉన్నాయి. ఈసారి మాత్రం విజేతగా నిలిచిన వైకాపా అభ్యర్థి వరప్రసాద్‌రావుకు వచ్చిన మెజార్టీ సరిపడ కూడా చింతాకు ఓట్లు రాలేదు. ఆయనకు డిపాజిట్ కూడా దక్కలేదు. నాలుగు పోలింగ్ బూత్‌లలో అయితే కాంగ్రెస్‌కు ఓటే లేదు. 9పోలింగ్ బూత్‌లలో ఒక్క ఓటు మాత్రమే పడింది. తిరుపతి లోక్‌సభలోని ఏడు సెగ్మెంట్లలో చూస్తే గూడూరు అసెంబ్లీలో ఎక్కువ వచ్చాయి. అక్కడ 9015ఓట్లు రాగా, వెంకటగిరిలో 6074, శ్రీకాళహస్తిలో 3591, సూళ్ళూరుపేటలో 3378, తిరుపతిలో 5754, సత్యవేడులో 3316, సర్వేపల్లిలో 1993ఓట్లు, అలాగే 2012 పోస్టల్ బ్యాలెట్లు లభించాయి.

రాష్ట్ర విభజన ప్రభావం చింతాపై తీవ్రంగానే పడింది. తిరుపతి జనం ఆయనను చిత్తుచిత్తుగా ఓడించారు. సమైక్య ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులకు బ్యాంకు లోన్లు ఇప్పిస్తానని, దుగరాజ పట్నం పోర్టును మొదలుపెట్టిస్తున్నానని ఆయన చేసిన ప్రకటనలను జనం ఏ మాత్రం పట్టించుకోలేదు.

### పచ్చిరొట్ట ఎరువులతో...

# భూమి సారవంతం

మర్రిపాడు మండలం డిసిపల్లిలోని పొగాకు బోర్డు వేలం కేంద్రాన్ని ఈనెల 19న భారత పొగాకు బోర్డు ఛైర్మెన్ గోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరుజిల్లాలో డిసిపల్లి, కలిగిరి వేలం కేంద్రాల పరిధిలో నాణ్యమైన పొగాకు పండుతోందని ముందుగా పచ్చిరొట్ట ఎరువులైన జీలుగలు వేసుకొని తదుపరి భూమిని దున్నుకోవడంతో ఇది సాధ్యమవుతుందని అన్నారు. సేంద్రియ ఎరువులనేవాడుకోవాలని తెలిపారు. ఆయనతో పాటు ఒంగోలు ప్రాంతీయ అధికారి భాస్కర్‌రెడ్డి, వేలం నిర్వహణాధికారి బాబురావు, రైతు నాయకులు జి.వెంగళరెడ్డి, బాలంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### లోకకల్యాణం కోసం చేసే...

# కర్మే తపస్సు

నెల్లూరు పురమందిరంలో జరుగుతున్న 64వజ్ఞానయజ్ఞం శ్రీ మద్రామాయణ సప్తాహంలో భాగంగా ఈనెల 19న శ్రీ రామలాలస మార్గదర్శనాచార్య పెరుంబుదూరు సూరిబాబు ఉపన్యసించారు. రామాయణం "తపః" అనే పదంతో ప్రారంభమై "ప్రవర్ధతామ్" అనే పదంతో ముగుస్తుందని, తపస్సు అనేది లోకకల్యాణం కోసం చేసే కర్మ అని పేర్కొన్నారు. గజదొంగ అయిన వాల్మీకి "రామ"జపంతో మహర్షి అయి ఆదికావ్యమైన రామాయణాన్ని లోకానికి అందించి మహనుభావుడిగా కీర్తించబడ్డారని అన్నారు. రామనామం, రామాయణం పరమ పవిత్రమైనవని వాటి విశిష్టతను, ఘట్టాలను తెలియపరుస్తూ రామదాసు, తులసీదాసు, తుకారాం కీర్తనలను శ్రావ్యంగా ఆలపించి సభికులను ఆనందడోలికల్లో ఊయలలూపారు.

కార్యక్రమంలో జ్ఞానయజ్ఞ కమిటీ నిర్వాహకులు కె.కృష్ణమూర్తి, హజరత్‌బాషా, జె.వి.కృష్ణయ్య, రఘురామయ్య, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Recognised by the Govt. of. A.P
MYTHILEE
మైథిలి
ENGLISH MEDIUM SCHOOL
Digital Smart Classes

10 G.SUBHASRI

10 B.RAHUL
A1, A2 గ్రేడ్స్
తెలుగు - 42 మ్యాథ్స్ - 39
హిందీ - 27 సైన్స్ - 37
ఇంగ్లీషు - 15 సోషల్ - 37
అడ్మిషన్లు జరుగుచున్నవి
మైథిలి మనోహర్‌రెడ్డి, కరస్పాండెంట్
ఎప్పటిలాగే 18వ సంవత్సరం కూడా
10వ తరగతిలో అద్భుత ఫలితాలు
46 మందికిగాను 40 మంది
8 నుండి 10 పాయింట్ల మధ్య సాధించారు
మైథిలి స్కూల్
చంద్రమౌళినగర్, నిప్పో ఎదురుగా
నెల్లూరు. ఫోన్ : 2304848
Facebook
www.facebook.com/mythileeschool

R.SONAM 9.7
P.VAISHNAVI 9.7
M.SAI JASWANTH 9.7
K.PAVAN 9.7
CH.CHANDANA 9.7
R.PRIYANKA 9.7

# నెల్లూరు కబుర్లు

## నేతలంతా హైదరాబాద్‌లో...

సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాలలో తేలుతున్నారు. జిల్లాలోని ఆ పార్టీ నాయకులతో పాటు కార్యకర్తలు కూడా చంద్రబాబును కలుసుకుని అభినందించడం కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. ప్రతిరోజూ పెద్దసంఖ్యలో ఇలా హైదరాబాద్‌కు పోతున్నారు. కాగా చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవానికి వెళ్లేందుకు కూడా పెద్దసంఖ్యలో కార్యకర్తలు సిద్ధమవుతున్నారు.

## తొలగిన ముసుగులు



ఎన్నికల షెడ్యూల్ పూర్తి కావడంతో నెల్లూరు జిల్లాలో ఆయా నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులను తొలగించారు. వరుసగా మున్సిపల్, పంచాయితీరాజ్, సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఎన్నికల నిబంధనల ప్రకారంగా దాదాపు మూడు నెలల నుండి నాయకుల విగ్రహాలకు ముసుగులు తగిలించే ఉన్నారు. జయంతులు, వర్ధంతులకు కూడా వారి విగ్రహాలకు దండలేసి దండం పెట్టుకునే అవకాశం లేకుండా పోయింది. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో విగ్రహాలన్నీ ముసుగులు తొలగించుకుని కొత్త రాజకీయ పరిణామాలను చూస్తున్నాయి.

### భావితరాలకు స్ఫూర్తి.. ఆదర్శమూర్తి...

## సుందరయ్య వర్ధంతి



దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం నెల్లూరు కనకమహల్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే నగరంలో పలుచోట్ల సుందరయ్య చిత్రపటాలను పెట్టి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, మస్తాన్‌బీ, కె.వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, జి.నాగేశ్వరరావు, అరిగెల రమమ్మ, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశం పంతులు వర్ధంతి




ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 57వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నెల్లూరు మద్రాసు బస్టాండ్ వద్దగల ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా బ్రాహ్మణ సేవాసంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, ఆ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్, తెలుగుదేశం రూరల్ కన్వీనర్ కిలారి వెంకటస్వామినాయుడు, కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్, బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి.చంద్రమౌళి, జిల్లా నాయకులు రాళ్లపల్లి రామసుబ్బారావు, ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, ధనుంజయ, బి.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

### అక్కడ కళకళ...

## ఇక్కడ వెలవెల

సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో సీన్ ఒక్కసారిగా మారిపోయింది. పదేళ్ల నుండి నెల్లూరు మినీబైపాస్‌లోని తెలుగుదేశంపార్టీ కార్యాలయం కళావిహీనమై వుండింది. నిన్నటి ఎన్నికలలో సాధించిన విజయంతో ఆ పార్టీ కార్యాలయంలో సందడి మొదలైంది. ఎప్పుడూ నాయకులు, కార్యకర్తలతో సందడిగా కనిపిస్తుంది.

ఇక మాగుంట లేఅవుట్‌లోని వైసిపి జిల్లా కార్యాలయమైతే బోసిపోయినట్లుంటుంది. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఇందిరాభవన్‌లో అయితే ఎప్పుడూ ఒకటే పరిస్థితి. అక్కడ పార్టీ కార్యక్రమాలు తక్కువగానూ, వ్యాపార, వాణిజ్య ప్రదర్శనలు ఎక్కువగానూ జరుగుతుంటాయి. 2004 నుండి ఎంతో సందడిగా కనిపించింది ఏ.సి.సెంటర్‌లోని నగర కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం. ఇటీవల వరకు కూడా ఇక్కడ ఎప్పుడు చూసినా జనం తిరునాల మాదిరిగా ఉండేవాళ్లు. ఇప్పుడు చూద్దామన్నా ఒక్క పురుగు కనిపించడం లేదు. అంతా అధికారం మాయ!

## లో ఓల్టేజీతో సతమతం

నెల్లూరులోని మాగుంట లేఅవుట్ సబ్‌స్టేషన్ పరిధిలో లోఓల్టేజీ సమస్య అధికంగా ఉంది. కొన్ని ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ సరిగా లేదు. వేసవికాలంలో రాత్రి సమయాలలో ఏ.సిలన్నీ ఆన్ అయ్యి ఒక్కసారిగా లోడ్ పెరుగుతుండడంతో ట్రిప్ అవుతున్నాయి. అర్ధరాత్రి, అపరాత్రి కరెంట్‌సమస్యలు తలెత్తుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

## జూనియర్ జన్మదిన వేడుకలు

నెల్లూరులో మంగళవారం జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు గంగాధర్ జనార్ధన్‌రెడ్డికాలనీలో అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం అందించారు. జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు చినగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అభిమానులు రక్తదానం చేసారు. నర్తకి సెంటర్‌లో కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు.

## బి.సి నేతకు అభినందనలు

తెలుగుదేశంపార్టీ నుండి ఎల్.బి.నగర్ శాసనసభ్యునిగా ఎన్నికైన బి.సి. సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను జిల్లా బి.సి. సంఘం నాయకులు మంగళవారం సత్కరించారు. బి.సి. సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పద్మజయాదవ్ ఆధ్వర్యంలో పలువురు ఆయనను కలిసి అభినందించారు.

## ఆర్టీఏ ఆఫీసులో గొడవ

నెల్లూరులోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో మంగళవారం ఆర్టీఏ ఏజెంట్లకు సిబ్బందికి మధ్య గొడవ జరిగింది. ఆర్టీఏ కార్యాలయంలోకి సిబ్బంది ఏజంట్లను అనుమతించలేదు. దీంతో కొందరు ఏజంట్లు గొడవకు దిగడంతో విషయం పోలీసులదాకా వెళ్లింది.

# పెద్దాయనకు నివాళులు



మాజీముఖ్యమంత్రి వర్యులు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మరణం తమను తీవ్రంగా కలిచివేసిందని జిల్లా మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి వందిళ్ళపల్లి అరుణమ్మ పేర్కొన్నారు. ఇటీవల జొన్నవాడలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో నేదురుమల్లి సంతాపసభను నిర్వహించారు. నేదురుమల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని వారు ప్రార్థించారు. జిల్లాలో ఎందరికో రాజకీయ భిక్ష పెట్టిన మహనీయుడని, భావితరాల నేతలు ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని రాజకీయాల్లో రాణించాలని అరుణమ్మ పేర్కొన్నారు. ఒకే సిద్ధాంతాన్ని, ఒకే పార్టీని నమ్ముకుని ఎంతో ఉన్నత స్థానానికి ఎదిగిన నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి నేటితరం రాజకీయ నాయకులకు ఓ రోల్‌మోడల్‌గా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వందిళ్లపల్లి పట్టాభిరామిరెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం నిర్వహించారు.

## ఆధునికతను సంతరించుకుంటున్న తపాలాశాఖ

నెల్లూరు ఆచారివీధిలోని జిల్లా ప్రధాన తపాలా కార్యాలయంలో ఈనెల 17న కోర్ బ్యాంకింగ్ సర్వీస్ (సీబీఎస్)ను రాష్ట్ర చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ బి.వి.సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని 95 పోస్టాఫీసుల్లో సీబీఎస్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. "నాణ్యత" పేరుతో మరో కొత్త పథకాన్ని ప్రారంభిస్తున్నామని, ఈ పథకం ద్వారా ఉత్తరం పోస్ట్‌బాక్స్‌లో వేస్తే దానిని ఎవరు ఎప్పుడు తీస్తున్నారో మొబైల్ ఫోన్‌కు సమాచారం వస్తుందని తెలిపారు. తపాలాశాఖ ఆధునికతకు అనుగుణంగా మార్పును సంతరించుకుంటోందని, పోటీకి తగ్గట్టు ఇప్పుడు తపాలాశాఖలో ఏటిఎంను కూడా ప్రవేశపెడుతున్నామని పేర్కొన్నారు.

## ఖజానా వద్ద డిష్యుం డిష్యుం



నెల్లూరు కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా కార్యాలయం వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఖజానా కార్యాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగుల మధ్య గొడవ చోటుచేసుకుంది. ఒకర్నొకరు తోసుకున్నారు. పెద్దఎత్తున అరుచుకున్నారు. పారా మెడికల్ ఉద్యోగులకు 5నెలల నుండి జీతాలు లేవు. ఇటీవలే ప్రభుత్వం మొదటి విడత బడ్జెట్‌ను విడుదల చేసింది. దీని ఆమోదం కోసం ఉద్యోగులు ఖజానా చుట్టూ తిరుగుతుంటే వాళ్లు తప్పించుకుంటున్నారేగాని ఆమోదించలేదు. దీంతో ఉద్యోగులు యూనైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరు ఎన్.శ్రీకాంత్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఖజానా కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు దిగారు. ఇక్కడే ఇరువురుకి గొడవ జరగడంతో పోలీసులు జోక్యం చేసుకుని సర్దుబాటు చేసి పంపారు.

### నేదురుమల్లి కుటుంబానికి

## కలెక్టర్ పరామర్శ

కీర్తిశేషులైన మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కుటుంబాన్ని ఈనెల 17న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పరామర్శించారు. విశాఖపట్టణం పార్లమెంటుసభ్యులుగా జనార్ధన్‌రెడ్డి వున్నప్పుడు అక్కడ తాను పనిచేసిన జ్ఞాపకాలను కలెక్టర్ శ్రీకాంత్ వారితో పంచుకున్నారు. జనార్ధన్‌రెడ్డి సతీమణి, మాజీమంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి, కుమారుడు రాంకుమార్‌రెడ్డితో కొంత సమయం ముచ్చటించి ఆయన ఘనతను నెమరువేసుకున్నారు. మిగిలిన జిల్లా అధికారులైన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సోమయ్య, బీసీ కార్పొరేషన్ ఈడీ కోటేశ్వరరావులు కూడా జనార్ధన్‌రెడ్డి కుటుంబాన్ని కలిసి పరామర్శించారు.

## 29న యం.ఐ.యం ఉచిత ఖత్నా

నెల్లూరులోని ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (యం.ఐ.యం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 29న ఉచిత ఖత్నా(ఒడుగు) కార్యక్రమం జరుగుతుందని జిల్లా అధ్యక్షులు యం.రవూఫ్ తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ షేక్.మహమూద్ నేతృత్వంలో పేద ముస్లిం పిల్లలకు సంతపేటలోని ఓబయ్య బడిలో ఒడుగు కార్యక్రమం నిర్వహిస్తామని, పిల్లల పేర్లు నమోదుకు ప్రధాన కార్యదర్శి సయ్యద్ హమీద్ హుస్సేన్‌ను 97038 26786లో, అడ్వకేట్ షఫీ అహమద్‌ను 94400 17786లో సంప్రదించమని తెలిపారు. ఖత్నా చేయించుకున్న పిల్లలకు మందులు, ఖత్నాగుడ్డ, గోధుమలు, చక్కెర ఉచితంగా అందిస్తామని, పేద ముస్లిం ప్రజలు సద్వినియోగం చేసుకోమని కోరారు.

## రోటరీ ఫౌండేషన్‌కు నూతన కార్యవర్గం



రోటరీ ఐ ఫౌండేషన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన ఛైర్మెన్‌గా పలగాటి శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శిగా ఎన్.రాఘవేంద్రశెట్టి, వైస్‌ఛైర్మెన్‌గా డాక్టర్ సి.దొరస్వామి నాయుడు, కోశాధికారిగా వేలూరు శ్రీనివాసులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మెన్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రోటరీక్లబ్ అనుబంధసంస్థగా 1992లో రోటరీ ఐ ఫౌండేషన్‌ను స్థాపించి ప్రతినెల ఒక గ్రామంలో ఉచితంగా నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. రోగులకు కంటి అద్దాలు, మందులు ఉచితంగా ఇవ్వడమే కాక అవసరమైన వారికి రోటరీ ఆసుపత్రి నందు ఆపరేషన్లు కూడా చేస్తున్నామన్నారు.

నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ పక్కనగల రోటరీ ఐ హాస్పిటల్ నందు ప్రతి మంగళ, బుధ, శనివారాలలో సాయంత్రం 5గంటల నుండి 7గంటల వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఓటమితో కుంగిపోను

**- ముంగమూరు**



నెల్లూరు నగర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాతీర్పును శిరసావహిస్తానని మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులోని తన ఇంట్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఓడినా రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి రావడం శుభపరిణామమని, సీమాంధ్ర అభివృద్ధికి ఇదో మంచి తరుణమని అన్నారు. నా మీద లేనిపోని దుష్ప్రచారం చేసారు. కరపత్రాలు పంచారు. ఓ పత్రిక అయితే అదేపనిగా తప్పుడు వార్తలు వ్రాసింది. జరిగిన అభివృద్ధి పనులపై అభూత కల్పనలు సృష్టించారు. ఇన్నిచేసి గెలవడం కూడా ఓ గెలుపేనా అని ఆయన ప్రశ్నించారు. తనపై ఆరోపణలు చేసినవారు ముందుకొచ్చి వాటిని నిరూపించాలని సవాల్ విసిరారు. నేను మొదటి నుండి తెలుగుదేశంలోనే ఉన్నాను. గత ఎన్నికల్లో కొన్ని కారణాల వల్ల ప్రజారాజ్యంలోకి వెళ్లాను. ఎమ్మెల్యేగా గెలిచాను. ఆ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కావడం వల్ల నగరాభివృద్ధి కోసం ఆ పార్టీతో కలిసి సాగాను. నగరాభివృద్ధిలో నేను భాగం పంచుకున్నానేగాని కాంగ్రెస్ అవినీతిలో మాత్రం నేను భాగస్వామిని కాదని ఆయన చెప్పారు. సీమాంధ్ర ప్రజలు అభివృద్ధిని, అవినీతిరహిత పాలనను కోరుకున్నారని, అందుకే చంద్రబాబును ఎంచుకున్నారన్నారు. నగరంలో తనకు ఓటేసిన ప్రజలకు, బాలకృష్ణ, పవన్‌కల్యాణ్, మహేష్‌బాబు అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ జడ్.శివప్రసాద్, ధర్మవరం సుబ్బారావు, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, దేవరాల సుబ్రహ్మణ్యం, వై.వి.సుబ్బారావు, మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

# తూర్పు ఎర్రబల్లిలో 'దేశం' గెలుపు

బ్యాలెట్ పేపర్లకు చెదలు పట్టిన కారణంగా కొండాపురం మండలంలోని తూర్పుయర్రబల్లి ఎంపీటీసీలో పొట్టిపల్లి, ఇస్కదామెర్ల, మన్నంవారిపల్లిలో రీపోలింగ్ నిర్వహించారు. సోమవారం ఈ మూడు బూత్‌లకు సంబంధించిన ఓట్లు కొండాపురం ఎంపీడీఓ కార్యాలయంలో లెక్కించారు. ఈ లెక్కింపు ద్వారా టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి ఎస్.కె.రసూల్ 114ఓట్ల మెజార్టీతో వైసిపి అభ్యర్థి మస్తానమ్మపై విజయం సాధించారు.

సింహపురి సమాచారం



# సీనియర్లకు సీన్ కట్

ఈ సార్వత్రిక ఎన్నికలు ఎంతో భిన్నంగా జరిగాయి. అంతకంటే భిన్నంగా ఫలితాలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో ఆత్మకూరు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సీనియర్ నేత ఆనం రామనారాయణరెడ్డి డిపాజిట్ కోల్పోయారు. ఇది చాలా దారుణమైన విషయం. సర్వేపల్లి నుండి పోటీ చేసిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా వరుసగా నాలుగవ సారి ఓటమిపాలయ్యారు. ఈ ఎన్నికల్లో ఆయన గెలిచుంటే మంత్రి పదవి దక్కుండేది. అలాగే మరో సీనియర్ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు వైకాపా అభ్యర్థిగా పోటీచేసి పరాజయం పొందారు. సీనియర్ ఎమ్మెల్యే పరసారత్నం సూళ్లూరుపేట తెలుగుదేశం అభ్యర్థిగా ఓడిపోవడం జరిగింది. 2009ఎన్నికల్లో కావలి ఎమ్మెల్యేగా గెలిచిన బీద మస్తాన్ రావు ఈ ఎన్నికల్లో ఓడిపోయారు. వైకాపాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఉదయగిరి అసెంబ్లీ నుండి, సీనియర్ నాయకుడు, మాజీఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య వెంకటగిరి నుండి పరాజయం పాలయ్యారు.

# విద్యార్థుల్లో చైతన్యం కలిగిస్తున్న 'శుభప్రదం'



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

వెంకటాచలం మండలం, కాకుటూరులోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాల ఆవరణంలో టిటిడి, హింధూధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 'శుభప్రదం' శిక్షణా కార్యక్రమాన్ని ఈనెల 19న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు శిక్షణా తరగతులలో చైతన్యవంతులై సమాజం పట్ల, మనిషి పట్ల మనిషికి వుండవలసిన సహజమైన ప్రేమ, మంచి నడవడికతో సమాజాభివృద్ధికి పాటు పడాలన్నారు. మానవీయ విలువలు, నైతిక జీవన విధానం అలవరుచుకొని సన్మార్గంలో నడవాలని పేర్కొన్నారు. హిందూధర్మ ప్రచార పరిషత్ నోడల్ ఆఫీసర్ బి.రామిరెడ్డి మాట్లాడుతూ 2012లో తిరుపతి, వైజాగ్, హైదరాబాద్, వరంగల్లు, గుంటూరు, అనంతపురం జిల్లాల్లో వారం రోజుల పాటు 2000మంది విద్యార్థులకు, 2013లో 5వేల మంది విద్యార్థులకు శుభప్రదం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. నెల్లూరుజిల్లాలో ప్రస్తుతం 300మంది విద్యార్థులకు నైతిక విలువల పట్ల చైతన్యం కలిగించేందుకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

కార్యక్రమంలో హిందూధర్మప్రచార కమిటీసభ్యులు మేడసాని మోహన్, అధ్యక్షులు సి.వి.సుబ్రహ్మణ్యం, బ్రహ్మకుమారి సమాజం సభ్యులు విదీజ, షీలాజీ, అడహక్ ఇన్‌చార్జి జయరామయ్య, పరిరక్షణ కోఆర్డినేటర్ డా॥శ్రీహరి, ధర్మప్రచారకమిటీ కార్యదర్శి ధనుంజయ్, కమిటీ సభ్యులు ఆలూరి శిరోమణిశర్మ, కె.గిరిజాకుమారి, ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



పూండ్ల చెంచురెడ్డి గారు

సంస్మరణ

మా అభ్యున్నతికి కారకులు, మాకు స్ఫూర్తిప్రదాతలు,
బంధుజనప్రియులు, సమతావాది
పూండ్ల చెంచురెడ్డి గారు
పరమపదించి తేది.27-05-14 నాటికి
ఇరవైఆరు సంవత్సరాలు నిండుతాయి.
ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకొంటూ...

భార్య :
పూండ్ల కామేశ్వరమ్మ

కుమారులు :
డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి
పూండ్ల వెంకురెడ్డి

మరియు
కుటుంబసభ్యులు

గల్పిక

# బీజేపీ విజయోత్సవసభలో మోడీకి మొండిచేయి

న్యూఢిల్లీలోని బీజేపీ కార్యాలయం... అక్కడంతా చాలా సందడిగా వుంది. కార్యకర్తలు జెండాలు పట్టుకుని ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ అక్కడకు ఉత్సాహంగా వస్తున్నారు. వచ్చినవారికి స్వీట్లు ఇస్తున్నారు. అక్కడే ఓ చిన్న టీస్టాల్ ఏర్పాటు చేసారు. అక్కడ నరేంద్ర మోడీ నిలబడి వచ్చిన వారందరికీ టీ ఇస్తున్నాడు. అప్పుడే వెంకయ్యనాయుడు అక్కడకు వచ్చి... మోడీజీ... మీరు టీ ఇస్తున్నారేంటి, ఇక్కడ ఛాయ్‌వాలాలు చాలా మంది ఉన్నారుగా అని అన్నాడు. అందుకు మోడీ... ఎప్పుడో చిన్నప్పుడు టీ అమ్మాను, ఈమధ్య ప్రచారం ఎక్కువుగా టీ గురించే జరిగింది. ప్రధాని అయ్యాక టీ అమ్మే అవకాశం ఎలాగూ రాదు. అదీగాక కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారంలో తమ ఆఫీసు వద్ద నాకు టీ కొట్టు పెట్టుకునే అవకాశం కల్పిస్తామన్నారు. కాని ఇప్పుడు అక్కడ టీ కొట్టు పెట్టినా జనాలు వచ్చి తాగే పరిస్థితి లేదు. ప్రధాని అయ్యేలోపు ఛాయ్‌వాలా మోజును తీర్చుకుందామనే ఈ పని చేస్తున్నానని చెప్పాడు. సరే, మీ ముచ్చట తీర్చుకుని త్వరగా లోపలకు రండంటూ వెంకయ్యనాయుడు వెళ్లిపోయారు. ఆ తర్వాత రాజ్‌నాథ్‌సింగ్, అద్వానీ, సుష్మాస్వరాజ్, అరుణ్‌జైట్లీ, ప్రకాశ్ జవదేకర్, యశ్వంత్ సిన్హా, ప్రత్యేకంగా తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడులు కూడా అక్కడకు వచ్చారు. ఆరోజు బీజేపీ విజయంలో కీలకపాత్ర పోషించిన వారికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. అద్వానీ, సుష్మాస్వరాజ్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. బీజేపీ విజయంలో కీలకపాత్ర పోషించింది తామే కాబట్టి తమను ఖచ్చితంగా సన్మానించి తీరుతారనుకున్న నరేంద్ర మోడీ, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడు వంటి నాయకులంతా తమకు వేసే శాలువాలు, మెమొంటోలు, పూలమాలలు పట్టుకోవడానికి వెనుక అనుచరులను కూడా తెచ్చుకున్నారు. సుష్మాస్వరాజ్ మొదట సభను మొదలుపెట్టారు. మొదట ఆమె లేచి మాట్లాడుతూ... ఈ విజయం అపూర్వం, అద్భుతం... బీజేపీకి ఇలాంటి గెలుపు దక్కుతుందని నేను కలలో కూడా అనుకోలేదు. ఈ అద్భుత విజయం కేవలం ఇద్దరే ఇద్దరు వ్యక్తుల వల్ల సాధ్యమైందని చెప్పింది. ఆమె చెప్పేది తమ గురించే అన్నట్లు మోడీ, రాజ్‌నాథ్‌సింగ్‌లు ఒకరి ముఖాలనొకరు చూసుకున్నారు. తర్వాత అద్వానీ లేచి మాట్లాడుతూ... ఈ ఎన్నికల్లో ఎన్డీఏకు మెజార్టీ రావచ్చనుకున్నాగాని, ఇంతగా వస్తుందనుకోలేదు. ఈ మెజార్టీని చూసి నాకే తల తిరిగినంత పనయ్యింది. ఇప్పటికీ నమ్మబుద్ధి కావడం లేదు. నిజంగా దేశ ప్రజలు బీజేపీకే ఓటేసారా... లేక వేరే పార్టీకి వేసిన ఓట్లన్నీ ఈవిఎంలలో సాంకేతిక లోపం కారణంగా కమలంకు పడ్డాయా? అనే అనుమానం కూడా మాకు కలిగింది. అసలు ఈ ఫలితాలు ఎలా వచ్చాయనే దానిపై విశ్లేషణ చేపట్టాము. జనం బీజేపీకి ఓట్లేసారా? లేక ఆ ఇద్దరు వ్యక్తుల ప్రభావంతో ఓట్లేసారా అనే దానిపై నిజ నిర్ధారణ కమిటీని వేసాం... వాళ్లు శోధించి, చేధించి చెప్పిందేందంటే ఆ ఇద్దరి వల్లే బీజేపీకి ఓట్లు పడ్డాయని. కాబట్టి వారిద్దరినీ సత్కరించాలనుకుంటున్నాం అని అన్నాడు. అప్పుడు కూడా మోడీ, రాజ్‌నాథ్‌సింగ్‌లు ఆయన చెప్పేది మన గురించే అన్నట్లు ఒకర్నొకరు చూసుకున్నారు. అద్వానీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... బీజేపీ విజయంలో కీలకపాత్ర పోషించిన ఆ ఇద్దరికీ ఇప్పుడు సత్కార కార్యక్రమం జరుగుతుంది... నేనిప్పుడు వారిని వేదికమీదకు పిలుస్తాను... మీరు చప్పట్లు కొట్టి స్వాగతించండి అని చెబుతుండగా మొదట రాజ్‌నాథ్‌సింగ్ లేవడానికి ఫ్యాంట్ సర్దుకొంటున్న తరుణంలో... అద్వానీ నోటి నుండి... మిస్టర్ మన్మోహన్‌సింగ్, శ్రీమతి సోనియాగాంధీజీ... కమాన్‌టు దయాస్ అనే మాటలు తూటాల్లా వచ్చాయి. ఆ పేర్లు వినడంతో మోడీ, రాజ్‌నాథ్‌సింగ్‌లతో సహా అందరూ అవాక్కయ్యారు. చప్పట్ల బదులు నిశ్శబ్ధం అలుముకుంది. కాని అప్పుడే అక్కడే ఓ మూలన కూర్చుని వున్న మన్మోహన్‌సింగ్, సోనియాగాంధీలు లేచి స్టేజీ ఎక్కసాగారు. అంత నిశ్శబ్ద వాతావరణంలో వెంకయ్యనాయుడు లేచి... అధ్యక్షా ఇది అన్యాయం అంటూ అరిచాడు. ఏది అన్యాయం అంటూ అద్వానీ ప్రశ్నించాడు. దానికి వెంకయ్య... బీజేపీ గెలుపు కోసం కష్టపడింది నరేంద్ర మోడీ అయితే సన్మానం వాళ్లకు చేస్తారా అంటూ ప్రశ్నించాడు. అప్పుడు అద్వానీ... మోడీ ఏం కష్టపడ్డాడని అడిగాడు. దానికి వెంకయ్య... మోడీ 3లక్షల కిలోమీటర్లకుపైగా తిరిగాడు. ఎన్నో సభల్లో పాల్గొన్నాడు. ఆయనకు కాక ఇంకెవరికి చేయాలి సన్మానమన్నాడు. అందుకు అద్వానీ... మోడీ ఏ.సి వున్న విమానాల్లో 3లక్షల కిలోమీటర్లు తిరగడం గొప్పకాదు, నేను ఎర్రటి ఎండలో రామరథయాత్ర పేరుతో వేలకిలోమీటర్లు రోడ్లమీద తిరిగాను... ఆయన కంటే ఎక్కువ సభల్లోనే పాల్గొన్నాను. మోడీకంటే పైలట్లు, ఎయిర్‌హోస్టెస్‌లు ఎక్కువ జర్నీ చేస్తారు. అందుకని వాళ్లను కూడా సన్మానిద్దామా? అని ఎదురు ప్రశ్నించాడు. అప్పుడు వెంకయ్య... సరే మోడీని మీరొప్పుకోరు... మరి మన పార్టీ విజయానికి, సోనియా, మన్మోహన్‌లకు సంబంధమేంటని అడిగాడు. దానికి అద్వానీ... ఖచ్చితంగా సంబంధం వుంది. ఈరోజు మనం అధికారంలోకి వచ్చామంటే అది వారి పుణ్యమే. ఈ పదేళ్లు యూపిఏ ప్రభుత్వంలో ప్రధానిగా మన్మోహన్‌సింగ్ ఏ పనీ చేయలేదు. యూపిఏ ఛైర్‌పర్సన్‌గా సోనియాగాంధీ కూడా ఆయన చేత ఏ పనీ చేయించలేదు. అంతేకాక తమ పాలనలో ఎన్నో అవినీతి కుంభకోణాలను ప్రోత్సహించి, ఇక బుద్ధుంటే కాంగ్రెస్‌కు ఓట్లేయకూడదురా అని జనం ఛీకొట్టే పరిస్థితి తెచ్చారు. కాబట్టే జనం వాళ్ళ మీద కోపంతో మనకు ఓట్లేసారు. అదే వాళ్లు శుద్ధంగా పనిచేసి వుంటే, మన్మోహన్‌సింగ్ చేత సోనియా పని చేయించి వుంటే మనకు ఇన్ని సీట్లు వచ్చేవా? అని ప్రశ్నించాడు. ఆ లాజిక్ ప్రశ్నకు ఎవరూ మాట్లాడలేకపోయారు. ఎందుకంటే అద్వానీ చెప్పింది వాస్తవమేనని అందరూ అనుకున్నారు. దాంతో మోడీకి, రాజ్‌నాథ్‌సింగ్‌కు వేద్దామని తెచ్చిన దండలు, శాలువాలన్నీ మన్మోహన్, సోనియాలకు వేసారు. చివరలో చంద్రబాబునాయుడు కూడా వెళ్లి... సోనియాకు శాలువా కప్పి దండవేసి, దండం పెట్టి దిగొచ్చాడు. అది చూసి వెంకయ్య, వాళ్లను మావాళ్లు సన్మానించారు సరే... సోనియాను నువ్వెందుకు సన్మానించావని చంద్రబాబును అడిగాడు. దానికి బాబు... ఆ మహాతల్లే నా పాలిట అధికార కల్పవల్లి. ఆమె రాష్ట్రాన్ని చీల్చబట్టే సీమాంధ్రలో నాకు అధికారం దక్కింది. లేకపోతే నా పాత్ర ప్రతిపక్షంలోనే ఉండేదన్నాడు. ఆ మాటకు వెంకయ్య నోరెళ్లబెట్టాడు.

## కదంబం

### పోరువాక

**ఎస్.ఆర్.భల్లం**
**తాడేపల్లిగూడెం, 98854 42642.**

నడుస్తూ
ఎగిరే ధూళి కణాన్నీ
ఈదుతూ
తడిపే నీటి బిందువుల్నీ
అడగండి...!

బంక మన్ను మోసుకొచ్చి
మట్టి గూడు కట్టే జోరీగల్నీ
రెట్టింపు బరువు మోసుకొచ్చి
సహజీవనం చేసే చీమల్నీ
అడగండి...!!
బహుశా
శ్రమశక్తిలోనే
ఒత్తిడిని ఒత్తిగిల్లించే గుణముందేమో

మనిషి అంటే
గడ్డకట్టిన మట్టి కణాల సమూహంకదా
ప్రశ్నలన్నింటికి
పరిస్థితులే జవాబులైనప్పుడు

చడీ చప్పుడు లేకుండా
కొబ్బరి కాయలోకి
నీళ్ళొచ్చి చేరినంత మిస్టరీగా
మాట ఎప్పుడూ సారాంశంలోంచి రావాలి
మైదానం
పచ్చదనం ఇష్టపడని వాడు
వర్షానికి శత్రువైనట్టు
పూలబాసలు వినాలంటే
మనం తుమ్మెదలం అవ్వాలి
చుట్టూ ఎవరూ లేకున్నా
ఉనికిని ఎరుక పరచుకుంటూ
మన మధ్య పువ్వులు
ముళ్లయిపోయాయి ఎందుకో

తెంచబడే పోగులు ఒకటై
పెను ఉరితాడై పోతూంటే
ఏరువాక
పోరువాకయి ఎరుపెక్కిపోతుంది

## ఇంటికి చేరిన పనబాక

(3వపేజీ తరువాయి)

విస్మరించి, విభజనకు మద్దతు పలకడాన్ని ఇక్కడి ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. ఈ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఆమెకు వ్యతిరేకంగా రావడం వెనుక ఇలాంటి కారణాలు కూడా ముఖ్యమైనవనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది. అయితే, ఒక్కమాట. నాయకులు ఎవరెంతటివారైనా, పార్టీలో వున్నప్పుడు ఆ పార్టీలకు కట్టుబడి పనిచేయాల్సిందే. అందులో శ్రీమతి పనబాకకే కాదు, ఎవరికీ మినహాయింపేమీ లేదు. అయితే, పార్టీ తీసుకునే నిర్ణయాల్లో ఆ నిర్ణయాలేమైనా ఒకవేళ తమ ప్రాంత ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా వున్నప్పుడు, తాము ప్రజల పక్షం వహించాలి. పార్టీ అగ్రనేతల దృష్టికి తమ ప్రజల ఆకాంక్షలను తీసుకువెళ్ళాలి. ఒకవేళ పార్టీ అనుచిత నిర్ణయాలు తీసుకుంటే పార్టీకి ఎంత నష్టం వాటిల్లుతుందో తమవంతు బాధ్యతగా నాయకత్వానికి తెలియజెప్పడం నాయకుల కర్తవ్యంగా వుండాలే తప్ప, పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా సమర్ధించేయడం వల్ల ఒక్కోసారి ఆ పార్టీకే తీరని నష్టం కలగవచ్చు. దాదాపుగా ఇప్పుడు జరిగింది కూడా ఇలాంటిదే. దేశంలో కాంగ్రెస్ పరాజయానికి అనేక కారణాలుండవచ్చు. రాష్ట్రంలో ఓటమికీ కొన్ని కారణాలుండవచ్చు. అనేకస్థానాల్లో వ్యక్తులకంటే పార్టీకీ, కొన్ని స్థానాల్లో పార్టీ కంటే వ్యక్తులకే ప్రాధాన్యత వుండవచ్చు. ఏదైనా ఒక పార్టీ విజయానికి, మరో పార్టీ అపజయానికీ కారణాలు కోకొల్లలుగానే వుంటాయి. ఆయా ప్రాంతాల పరిస్థితులను బట్టి కూడా గెలుపోటములు సంభవిస్తుంటాయి. అయితే, అత్యంత కీలకమైన సందర్భాల్లో..ఎవరికెంత కష్టం కలిగినా, నష్టం కలిగినా, నాయకులెప్పుడూ ప్రజలపక్షంగానే వుంటారనే ప్రగాఢమైన నమ్మకాన్ని ప్రజలకు కలిగించాలి. అది లోపించినప్పుడు..ఇలాంటి ఓటములు తప్పవు. శ్రీమతి పనబాక విషయంలోనూ ఇలాంటి లోపమే జరిగిందనేది రాజకీయవర్గాల భావన. భవిష్యత్తులోనైనా ఇలాంటి లోపాలను సరిదిద్దుకుంటే, ప్రజల ఆకాంక్షలకు తగ్గట్లుగా, ప్రజల పక్షంగా వ్యవహరిస్తే చెడు కన్నా మంచే ఎక్కువ జరిగే అవకాశం వుంది.

తనకు మంత్రి పదవి ఇచ్చి పదేళ్ళు పెత్తనం కట్టబెట్టిన అధిష్టానం మీదున్న ప్రేమ, తనను గెలిపించి మంత్రి కావడానికి కారకులైన ప్రజల మీద లేకపోవడం విడ్డూరం... విచారకరం! పది సంవత్సరాలు మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఈ చిన్న లాజిక్‌ను తెలుసుకోలేకపోవడం బాధాకరం. చూద్దాం... ఇప్పటికైనా ఈ నేతలు మారి తమ తలరాతలు మార్చే ప్రజల పక్షాన నిలుస్తారో? లేక తలతిక్క నిర్ణయాలు తీసుకునే అధిష్టానాలకి తలవొగ్గి శాశ్వతంగా మాజీలౌతారో?

## నెల్లూరుజైలుకు మొద్దుశీను హంతకుడు

పరిటాల రవి హత్యకేసులో ప్రధాన నిందితుడు జూలకంటి శ్రీనివాసరెడ్డి అలియాస్ మొద్దుశీనును జైలులోనే అంతమొందించిన హంతకుడు మల్లెల ఓంప్రకాశ్‌ను నెల్లూరు కేంద్ర కారాగారానికి తీసుకొచ్చారు. పరిటాల హత్యకేసులో నిందితుడిగా వున్న మొద్దుశీనును 2008 నవంబర్ 11న అనంతపురం జైలులో ఓం ప్రకాశ్ చంపాడు. నిద్రపోతున్న మొద్దుశీను తలపై సిమెంట్ డంబిల్‌తో కొట్టి చంపాడు. దాంతో ఓంప్రకాశ్‌ను చర్లపల్లి జైలుకు తరలించారు. కొంతకాలం తర్వాత వరంగల్ జైలుకు పంపారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో సీమాంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఖైదీల పంపకాలు కూడా మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఓంప్రకాశ్‌ను నెల్లూరుజైలుకు పంపారు. మద్దెలచెరువు సూర్యనారాయణరెడ్డి హత్యకేసులో ప్రధాన ముద్దాయి అయిన భానుకిరణ్‌ను కూడా నెల్లూరు జైలుకు తీసుకొచ్చే అవకాశాలున్నాయి.

## వియస్‌యులో ఇంజనీరింగ్ కాలేజీ

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అనుబంధంగా ఇంజనీరింగ్ కళాశాల నిర్వహణకు ప్రభుత్వం నుండి అనుమతి లభించింది. 2014-15 అకడమిక్ సంవత్సరానికి ఎంసెట్ కోడ్ విఎస్‌యుఇగా పరిగణించబడుతుందని యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య నాగేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.


## వింజమూరు గ్రామపంచాయతి కార్యాలయము

ఆర్.ఓ.సి.నెం.6/2014 | తేది.18.05.2014

### టెండరు ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వింజమూరు మండలము వింజమూరు గ్రామ పంచాయతి 2014-2015 సంవత్సరమునకు సంబంధించి ఈ క్రింది వస్తువులు దపాలవారీగా సరఫరా చేయుటకు టెండర్లు వింజమూరు గ్రామపంచాయితి కార్యాలయంలో తే. 29. 5. 2014ది ఉదయం 11గం॥ల నుండి మధ్యాహ్నం 2గం॥ల వరకు నిర్వహించబడును. అదే రోజు మధ్యాహ్నం 3గం॥ల నుండి హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. టెండరు దాఖలు చేయువారు ధరావత్తు చెల్లించి టెండర్లు దాఖలు చేయ వలయును ఇతర వివరములు పంచాయతి కార్యాలయంలో పనిచేయు వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

| వ.నెం. | వివరములు | ధరావత్తు రూ. |
|---|---|---|
| 1. | 2014-15 సంవత్సరమునకు స్టేషనరీ ఎల్.ఎఫ్ ఫారాలు సరఫరా చేయుట. | 500.00 |
| 2. | 2014-15 సంవత్సరమునకు పి. హెచ్ సామానులు సరఫరా చేయుట. | 500.00 |
| 3. | 2014-15 సంవత్సరమునకు పి.డబ్ల్యు.యస్ సామాన్లు విడిభాగముల సరఫరా చేయుట. | 1000.00 |
| 4. | 2014-15 సంవత్సరమునకు వీధి విద్యుత్ దీపములు సరఫరా చేయుట. | 1000.00 |
| 5. | 2014-15 సంవత్సరమునకు పి.డబ్ల్యు.యస్ స్కీమునకు సంబంధించిన మోటార్లు మరమ్మత్తులు, రీవైండింగ్ మరియు ఇతరములు మరమ్మత్తులు చేయుట కేటగిరి వారీగా. | 500.00 |

గమనిక: A. అనివార్య కారణముల వలన ప్రభుత్వమువారు టెండరు నిర్వహించు తేదీని సెలవుదినముగా ప్రకటించిన మరుసటిరోజు టెండర్లు నిర్వహించబడును.
B. టెండర్లు పాక్షికముగాగానీ, పూర్తిగాగానీ రద్దుపరచుటకు పంచాయతీ కార్యదర్శి వారికి అధికారము కలదు.

సం/- సి.హెచ్.వరప్రసాద్ రావు,
పంచాయతీ కార్యదర్శి, వింజమూరు గ్రామపంచాయతి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 23.05.2014 నుండి
తేది. 29.05.2014 వరకు

ఈ వారం మీనమేషవృషభ రాశులలో చంద్రుడు, మేషంలో శుక్ర కేతువులు, వృషభంలో రవి, మిథునంలో గురువు, బుధుడు, కన్యలో కుజుడు, తులలో శనిరాహువులు సంచరిస్తారు.

పంచాంగము: తేది 23 శుక్రవారం హనుమజ్జయంతి.
తేది 28 బుధవారము కర్తరీ సమాప్తము.
ముహూర్తము: ముహూర్తములు లేవు.

**వైశాఖ మాస కృష్ణ పక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 23 | శుక్ర | దశమి | రా॥గం.3.45వ॥ |
| తేది. 24 | శని | ఏకాదశి | రా॥గం.1.58వ॥ |
| తేది. 25 | ఆది | ద్వాదశి | రా॥గం.12.35వ॥ |
| తేది. 26 | సోమ | త్రయోదశి | రా॥గం.11.36వ॥ |
| తేది. 27 | మంగళ | చతుర్దశి | రా॥గం.11.08వ॥ |
| తేది. 28 | బుధ | అమావాస్య | రా॥గం.11.09వ॥ |
| తేది. 29 | గురు | పాడ్యమి | రా॥గం.11.38వ॥ |

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వ్యాపారవర్గాలకు ఆశించిన అభివృద్ధి, ఆదాయము లభిస్తుంది. ఆర్థిక ఇబ్బందులు కొంత వరకు సర్దుబాటు చేస్తారు. అనుకున్న పనులు నిదానంగా జరుగుతూ టెన్షన్ పెడుతుంటాయి. అవసరాలకు తప్పనిసరిగా ఋణాలు చేయవలసివస్తుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. సోదరసోదరీవర్గానికి అభివృద్ధి ఉంటుంది. ఆత్మీయులను పెద్దలను కలుసుకుంటారు.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆదాయంకంటే ఖర్చులు ఎక్కువకాగలవు. వ్యాపార వృద్ధికి పథకాలు ప్రణాళికలతో ముందుకుసాగుతారు. వృత్తి జీవనంలో వ్యాపకం పెరిగి ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. ఆరోగ్యం సరిగా ఉండక బాధపడతారు. దూరప్రాంత ఆత్మీయులను బంధువులను కలుసుకొంటారు. దూరప్రయాణాలు తప్పనిసరిగా ఉండవచ్చును. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

### మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆదాయవ్యయాలు సరిపోతుంటాయి. వృత్తి వ్యాపారాలలో రాబడి పెరుగుతుంది. కొత్త పెట్టుబడులకు, నూతన వ్యాపారాలకు అవకాశాలు బాగుంటాయి. చిన్న చిన్న ఆటంకాలు కలిగినా అనుకున్న పనులు నెరవేరగలవు. ప్రభుత్వ అనుమతులు, ఋణాలు ఆలస్యంకాగలవు. ఉద్యోగావకాశాలు బాగుంటాయి. శుభకార్యాలు నిర్ణయంకావడం, ఇతరుల పనుల మీద ప్రయాణాలుంటాయి.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయానికిమించిన ఖర్చులుంటాయి. వ్యాపార వృద్ధికి చేసిన కృషి తగిన ఫలితం ఉండకపోవచ్చును. వృత్తి జీవనము కలవారికి కొంత సంతృప్తి ఉంటుంది. చేయదలచిన పనుల విషయంగా నిర్దిష్ట ప్రణాళికలతో ముందుకు సాగుతారు. సోదరులకు ఒక విషయంలో మంచి జరుగుతుంది. బంధుమిత్రులతో భేదాభిప్రాయాలు ఏర్పడవచ్చును. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి వ్యాపారాలు ఆశావహంగా ఉండి ఆదాయం బాగుంటుంది. క్రయవిక్రయాలు లాభసాటిగా ఉంటుంది. ప్రభుత్వ సహాయం, ప్రభుత్వం నుండి అనుమతులు లభించవచ్చును. ఉద్యోగులు శ్రమకు తగ్గ ప్రతిఫలం అందుకుంటారు. ఉద్యోగప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. విలువైన వస్తువులను సమకూర్చుకొంటారు. కమిటీల, సమావేశాలలో మీ మాటకు విలువ ఉంటుంది. ఆకస్మిక ప్రయాణాలుంటాయి.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. వృత్తి జీవనము కలవారికి స్వల్పంగా ఇబ్బందులు పడతారు. ఇతరుల మీద బాధ్యతలుపెట్టి ఆధారపడకుండా మీ పనులు మీరే చేయడం మంచిది. ఆత్మీయులకు స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. వ్యవసాయదారులకు ఆర్థిక ఇబ్బందులు తప్పవు. గృహ వస్తు వాహనరిపేర్లుంటాయి. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం. గృహమార్పులుంటాయి.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అనుకోని ఖర్చుల తాకిడి పెరిగి ఆదాయవ్యయాలతో తేడా వస్తుంది. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు అభివృద్ధి బాగుండి రాబడి ఉంటుంది. సరియైన నిర్ణయాలు జరగక టెన్షన్ పడుతుంటారు. పనులు కూడా వాయిదాలు పడతాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరుగవచ్చును. అవసరాలకు ఋణాలు చేయడం, అప్పుల వత్తిడి ఉంటుంది. శుభకార్యాలు నిర్ణయంకావడం జరుగగలదు.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక విషయాలలో తొందరపడవద్దు. వృత్తి వ్యాపారాలలో ఆశించిన అభివృద్ధి ఉండదు. ఆదాయం తగ్గుతుంది. కుటుంబ ఖర్చులు, ఇతర అదనపు ఖర్చులు పెరుగుతాయి. వస్తు నష్టం ఉంటుంది. విలువైన పత్రాలు, డబ్బును జాగ్రత్త పరచుకొనండి. శ్వాసకోశ రుగ్మతలు, జననేంద్రియ అవయవ సమస్యలుండగలవు. గృహ, వస్తు, వాహన రిపేర్లుండి ఖర్చులు పెరుగుతాయి.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆందోళన కలిగించిన సమస్యలు సానుకూలము కాగలవు. పనులు అనుకూలంగా నెరవేరతాయి. వృత్తి వ్యాపారాలలో ఆర్థికాభివృద్ధి బాగుంటుంది. ఆదాయం బాగుంటుంది. అయితే అనుకోని పెద్ద ఖర్చు వారం మధ్యలో తగలవచ్చును. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. స్థిరాస్తులను కొనుగోలుయత్నాలు జరుగుతాయి. గృహోపకరణాలు, విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వ్యాపార వ్యవహారాలలో ఇబ్బందులుంటాయి. ఆశించిన అభివృద్ధి ఉండక రాబడి తగ్గుతుంది. వృత్తి పరంగా ప్రాపకం బాగుంటుంది. క్రొత్త పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యముకు అవకాశాలు లభిస్తాయి. వివాహాది శుభకార్య నిర్ణయాలు జరుగును. ఆర్థిక, కుటుంబరహస్యాలను ఇతరులతో చెప్పకండి. బంధు మిత్రులతో విభేదాలు కలుగవచ్చును.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

హామీలు, మధ్యవర్తిత్వాల వంటి వాటిలో జోక్యం చేసుకొనవద్దు. వాహనాలు నడిపే వారికి, కరెంటు యంత్రాల పనులు చేసే వారు జాగ్రత్తపడాలి. గాయాలు తగలవచ్చును. ఋణాల వత్తిడి ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుండి ఆదాయము పెరగవచ్చును. పదవీ, ఆర్థిక అవకాశాలు ప్రయత్నపూర్వకంగా కలిసివస్తాయి. సొంత వ్యాపారాల మీద శ్రద్ధ అవసరం.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులు ఆశించినంత తొందరగా జరగవు. తొందరపాటు నిర్ణయాలు చేయకండి. వృత్తిపరంగా, వ్యాపారపరంగా అభివృద్ధి బాగుంటుంది. రావలసిన బాకీలు కొంత అందుతాయి. ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాలు నిర్ణయంకాగలవు. ఆరోగ్యం నిలకడగానే ఉంటుంది. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, ఉన్నత విద్యావకాశాలు బాగుంటాయి.

వైభవంగా ముగిసిన...

## విశ్వనాథస్వామి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు ఉస్మాన్ సాహెబ్ పేటలోని అన్నపూర్ణ విశాలక్షి సమేత శ్రీ కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో ఈనెల 9 నుంచి జరిగిన బ్రహ్మోత్సవాలు 17వ తేదీ వైభవంగా జరిగిన పుష్పయాగం, ఏకాంతసేవలతో ముగిసాయి. ఆలయ ప్రధానార్చకులు వందవాసి విశ్వనాథగురుకుల్ ఆధ్వర్యంలో అన్నపూర్ణ, విశాలక్షి దేవేరుల సమేతుడైన కాశీవిశ్వనాథ స్వామికి అర్చకులు మంగళస్నానాలు నిర్వహించి పట్టుపీతాంబరాలు, పుష్పాలతో అందంగా అలంకరించారు. తదుపరి అలంకార మండపంలో స్వామిని కొలువుదీర్చి విశేషపూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఇఓ మధుసూదనరావు పర్యవేక్షించగా నాగరాజు, దేవసేన, సుబ్బారావు, కొలపర్తి రమేష్, మాచవోలు రాజశేఖరశాస్త్రి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో పితానికి ఘనస్వాగతం



బుధవారం నెల్లూరుకు వచ్చిన ఆచంట తెలుగుదేశం ఎమ్మెల్యే, మాజీమంత్రి పితాని సత్యనారాయణకు జిల్లా గౌడ సంఘం నాయకులు మరియు కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఛైర్మెన్ జానారామచంద్రయ్యగౌడ్ నాయకత్వంలో నెల్లూరు రైల్వేస్టేషన్‌లో ఘనస్వాగతం పలికారు. ఆయనను గజమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ తాను బడుగు బలహీన వర్గాల ప్రజల ఆశీస్సులతోనే రాజకీయంగా ఈ స్థాయిలో ఉన్నానని, వారి సమస్యలు, అవసరాలు తెలుసుకుని వారి సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో రావుల వెంకటేశ్వర్లు గౌడ్, తాతా నాగేశ్వరరావు, అన్నం దయాకర్‌గౌడ్, ముక్కు రాధాకృష్ణ, ఎం.శ్రీనివాసులు, చిలకా శ్రీనివాసులు, ఉప్పాల సుధాకర్‌గౌడ్, ఆలూరు ప్రద్యుమ్నరెడ్డి, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదమరిచారా అంతే సంగతులు

### పట్టపగలే దొంగతనాలు

పగలు లేదు, రాత్రి లేదు ఎప్పుడైనా ఒక్కటే అన్నట్టుగా నెల్లూరులో దొంగతనాలు జరిగిపోతున్నాయి. ఏ మాత్రం ఆదమరిచారా అంతే సంగతులు పేద, పెద్ద అన్న బేధం లేకుండా ఎవరి ఇళ్ళల్లోనైనా చోరీలు చేయడమే దొంగలపని పగలేకదా ఏమవుతుందిలే అన్న ధీమాతో ఇంటికి తాళంవేసి బయటకుపోయారో చాకచక్యంగా తలుపులు తెరవడం ఇంటిలో వుండే నగదు, నగ నట్రా దోచుకోవడం పరిపాటిగా మారిపోయింది. ఈనెల 19న సింహపురికాలనీలో నివసిస్తున్న పందిపాటి శివమస్తానయ్య ఇంటిలో ఇలాగే పట్టపగలు దొంగతనం జరిగింది. మస్తానయ్య విద్యుత్‌శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తూ విధి నిర్వహణకు వెళ్ళగా ఆయన భార్య, కుమార్తె ఉదయం 11గంటలకు పనిమీద బయటకువెళ్ళారు. అంతే దొంగలు చేతికి పనిచెప్పి ఇంటి తలుపులు బద్దలుగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో వుండే బంగారు నగలు దొంగిలించారు.

మధ్యాహ్నం 2గంటలకు తల్లీకూతురు ఇంటికి వచ్చి తలుపులు తెరిచి వుండడంతో అవాక్కయ్యారు. బీరువా తెరిచి అందులో వున్న నాలుగున్నర సవర్ల బంగారు నగలు కనిపించకపోవడంతో కన్నీరు మున్నీరయ్యారు. వెంటనే 2వనగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చెయ్యడంతో ఎస్సై సాయిశివరావు సంఘటనాస్థలానికి వచ్చి పరిశీలించి కేసు నమోదు చేసారు.

అదే రోజు తెల్లవారుజామున ముత్తరాజువీధిలోని తరుణ్‌కుమార్ జైన్ ఇంట్లో దొంగలు ప్రవేశించి 60సవర్ల బంగారు నగలు, కిలో వెండి నగలు అపహరించారు. ఎండాకాలం కావడంతో అంతర రాష్ట్ర దొంగలు నగరంలో తిష్టవేయడంతో ఈ దొంగతనాలు జరుగున్నట్టు తెలుస్తోంది. వారు వీధుల్లో రెక్కీ నిర్వహిస్తూ ఈ విధంగా దొంగతనాలకు పాల్పడుతున్నట్టు సమాచారం. పోలీసులు ఈ తరహా దొంగతనాలపై దృష్టిపెట్టి నియంత్రించేందుకు చర్యలు తీవ్రం చెయ్యకపోతే దొంగలు రెచ్చిపోతారు. కాబట్టి జిల్లా ఎస్పీగారు తత్సంబంధిత చర్యలు తీసుకొని వాటిని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## బిజెపి కల్లుగీత కార్మిక విభాగం విజయోత్సవం




ఎక్సైజ్ ఆఫీసులో స్వీట్లు పంచుతున్న బీజేపీ గీత కార్మికసెల్ నేతలు

నెల్లూరు భక్తవత్సలనగర్ కూడలిలో భారతీయ జనతాపార్టీ కల్లుగీత కార్మిక విభాగం జిల్లా సమన్వయకర్త కుడుముల గిరికుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బిజెపి విజయోత్సవ సంబరాలు దిగ్విజయంగా జరిగాయి. కూడలిలో మిఠాయిలు పంచి ర్యాలీగా జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ కార్యాలయం చేరుకుని అధికారులు, సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేసి తమ సంతోషాన్ని ప్రకటించారు.

ఈ సందర్భంగా గిరికుమార్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ ప్రధానమంత్రి పదవిని, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి పదవిని చేపట్టడం బడుగు, బలహీన వర్గాలు, కులవృత్తులు సాగించే కార్మికులకు శుభసూచకమని పేర్కొన్నారు. అందరూ అభివృద్ధిని సాధించడమేకాక, సమాజంలో తలఎత్తుకొని గౌరవప్రదంగా జీవించే సమయం ఆసన్నమయిందని అన్నారు. కార్యక్రమంలో బిజెపి కల్లుగీత కార్మిక విభాగం రాష్ట్ర సంయుక్త సమన్వయకర్త మారుబోయిన శ్రీనివాసగౌడ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు యెంపులూరు భాస్కర్‌గౌడ్, బిజెపి లీగల్ సెల్ జిల్లా సమన్వయకర్త దాసరి రాజేంద్రగౌడ్, చింతగుంట్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ వైభవం...!



నెల్లూరు, మాగుంట లేఅవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ సహకార్యదర్శి దండమూడి హేమంత్ కుమార్ - రాజశ్రీల కుమార్తె **చంద్రూష - దిలీప్‌బాబు** (తెనాలి వాస్తవ్యులు బొందలపాటి హరిబాబు - సుజాతల కుమారుడ్తు)ల కల్యాణం మే 15వ తేదీ విజయవాడలోని శ్రీ శేషసాయి కల్యాణ వేదికలో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.



నెల్లూరు వాడు, బెంగుళూరు నివాసి చిట్టమూరు వాసుదేవరెడ్డి - మహతిల కుమారుడు **మహర్షిరెడ్డి - లక్ష్మీమౌనిక**ల పెళ్ళి ఈ నెల 21వ తేదీ హైదరాబాద్‌లోని హెచ్.ఐ.సి.సి నోవాటెల్‌లో ఘనంగా జరిగింది. నూతనజంటకు 'లాయర్' శుభాశీస్సులు.



నెల్లూరు వాస్తవ్యులు బెజవాడ అనిల్‌కుమార్‌రెడ్డి - నీరజల కుమార్తె **విష్ణుప్రియ - వివేకానందరెడ్డి** (పొదలకూరు మండలం సూరాయపాళెం వాస్తవ్యులు పెనుబాక హజరత్‌రెడ్డి - అరుణమ్మల కుమారుడు)ల వివాహం మే 21వ తేదీ నెల్లూరులోని జి.పి.ఆర్. గ్రాండ్‌లో ఘనంగా జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాభినందనలు.



బెంగుళూరులో సిండికేట్ బ్యాంక్ చీఫ్‌మేనేజర్ భీమిరెడ్డి విజయకుమార్‌రెడ్డి - లక్ష్మిల కుమార్తె **దీప్తి - విష్ణుదీప్** (నెల్లూరు వాస్తవ్యులు బెల్లంకొండ ప్రభాకర్‌రావు - విజయలక్ష్మిల కుమారుడు)ల పరిణయం ఈ నెల 11వ తేదీ నెల్లూరు పరమేశ్వరి కల్యాణ మండపం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# ఐకమత్యంగా కలిసి పనిచేసాం

## తెదేపా రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి

నెల్లూరు మినిబైపాస్ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈనెల 17న విలేకరుల సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న తెదేపా రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్‌డిఏ, తెదేపా పరిపాలన లోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాయని, అలాగే ప్రస్తుతం కూడా ప్రజల తీర్పుతో అధికారంలోకి రానున్న ఎన్‌డిఏ, తెదేపాలు మ్యానిఫెస్టో ప్రకారం ప్రజలకు ఇచ్చిన హామీలను వాస్తవరూపంలోకి తెస్తాయని పేర్కొన్నారు. పార్టీలో వెన్నుపోట్లు లేనేలేవని, నాయకులంతా ఐకమత్యంగా కలసి పనిచేసారని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర మాట్లాడుతూ కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తమ నాయకుడు చంద్రబాబునాయుడిని చెట్టుకు కట్టేసి కొట్టాలన్నారని, అదే సందర్భంలో తాము ప్రసన్నను ప్రజలు ఓట్లతో కొట్టబోతున్నారని జవాబిచ్చామని, ప్రస్తుతం అదే జరిగిందని తెలిపారు. అవినీతి పునాదుల్లో పుట్టిన వైకాపాకు అడ్డదిడ్డంగా రాష్ట్రాన్ని విభజించిన మూర్ఖ కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యేకు ఎన్నికైన పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యేగా గెలిచిన కురుగొండ్ల రామకృష్ణ, తెదేపా నాయకులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డాక్టర్ జ్యోత్స్నలత, మాజీముఖ్యమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి, పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకట స్వామినాయుడు, నూనె మల్లికార్జునయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పెనుసవాళ్ళు

(మొదటిపేజీ తరువాయి)

అవసరం ఉన్నా లేకున్నా బ్యాంకుల్లో ఋణాలు తీసుకుంటూ వచ్చారు. చంద్రబాబు దానిని పట్టేసాడు. ఋణమాఫీ హామీ ఇచ్చాడు. చంద్రబాబుకు జగన్‌కు మధ్య ఓట్ల తేడా ఐదున్నర లక్షలే! ఋణమాఫీ హామీనే చంద్రబాబుకు పాతిక లక్షలకు పైగా ఓట్లు తెచ్చి వుంటుంది.

అలివిగాని హామీలైతే ఇచ్చాడు గాని, ఇప్పుడు చంద్రబాబు ముందున్నవి పెనుసవాళ్లు. వ్యవసాయ ఋణాలే లక్షన్నరకోట్లున్నాయంటున్నారు. ఇక డ్వాక్రా ఋణాల సంగతి సరేసరి. రాష్ట్ర విభజన ద్వారా కేంద్రం సీమాంధ్ర చేతిలో చిప్పపెట్టింది. ఇప్పుడు కొత్త రాజధాని కట్టుకోవాలి. ప్రతి శాఖకు కొత్త వనరులు సమకూర్చుకోవాలి, లక్షల కోట్లతో పని. ఇక్కడ చూస్తే ఖర్చు ఎక్కువ... ఆదాయం తక్కువ. ప్రతిదానికి కేంద్రంవైపు దీనంగా చూడాలి. లక్షన్నర కోట్ల ఋణమాఫీ చేసేంత ఆర్థిక సామర్థ్యం ఇప్పుడు మన ప్రభుత్వానికి లేదు. కాని ఋణమాఫీపై చంద్రబాబు ఏ మాత్రం వెనక్కు తగ్గినా ఆయనను నమ్మి మళ్లీ మోసపోయామని జనం అనుకునే ప్రమాదం ఉంది. కాబట్టి ఈ ఐదేళ్లు ప్రతిరోజూ, ప్రతి గంట ఆయనకు సవాలే!

# సీన్ మారుతోంది

(మొదటిపేజీ తరువాయి)

వాటి ఫలితాలను సార్వత్రిక ఎన్నికల తర్వాత ప్రకటించాలని ఆదేశించడం జరిగింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఫలితాలు వెల్లడించి వుంటే ఈరోజు రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వస్తుందన్నదానితో ప్రమేయం లేకుండా ఆయా స్థానిక సంస్థలలో మెజార్టీ సీట్లు తెచ్చుకున్న పార్టీలు అధికారాన్ని చేపట్టి ఉండేవి. కాని సార్వత్రిక ఎన్నికల ఫలితాలకంటే ముందే వాటి ఫలితాలను వెల్లడించినా, జడ్పీ ఛైర్మెన్, మేయర్, ఛైర్‌పర్సన్, ఎంపీపీ వంటి పోస్టులకు ఇంకా ఎన్నికలు నిర్వహించలేదు. కాని ఈలోపే రాష్ట్రంలో అధికారం తెలుగుదేశందేనని తేలిపోయింది. ఇప్పుడు స్థానిక సంస్థలపై ఆ అధికారం ప్రభావం చూపిస్తుంది. ఇక ఐదేళ్లు ప్రతిపక్షంలో ఎక్కడ కూర్చోగలమని భావిస్తున్న వైకాపా జడ్పీటీసీ, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు తెలుగుదేశం వైపు మొగ్గు చూపుతున్నట్లుగా తెలుస్తుంది.

దీంతో నెల్లూరుజిల్లాలో వివిధ సంస్థల ఫలితాలు తారుమారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో చూస్తే జిల్లా పరిషత్ ఎన్నికల్లో వైకాపా 31జడ్పీటీసీలను గెలుచుకోగా తెలుగుదేశం 15 జడ్పీటీసీలే దక్కాయి. ఫలితాలను బట్టయితే జడ్పీ ఛైర్మెన్ పీఠం వైకాపాదే! కాని వైకాపా అధికారంలోకి రాకపోవడంతో కొంతమంది జడ్పీటీసీలు తెలుగుదేశం వైపు చూస్తున్నారు. తెలుగుదేశం నాయకులు కూడా అధికారం చేతిలో ఉంది కాబట్టి కొంతమందిని తమ వైపు లాక్కుని జడ్పీ ఛైర్మెన్ పదవిని కైవసం చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు మున్సిపాల్టీలలోనూ అదే పరిస్థితి. నెల్లూరు కార్పొరేషన్‌లో, కావలి మున్సిపాల్టీలో వైకాపాకు మెజార్టీ సీట్లు వచ్చాయి. ఇక్కడ పూర్తి మెజార్టీతో అధికారాన్ని చేపట్టవచ్చు. కాని ఇక్కడ కూడా వైకాపాకు చెందిన కొందరు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు తెలుగుదేశం వైపు చూస్తున్నారనే ప్రచారం జరుగుతుంది. నాయుడుపేట, వెంకటగిరి మున్సిపాల్టీల్లో తెలుగుదేశంకు పూర్తి మెజార్టీ వుంది. ఆత్మకూరు, గూడూరు, సూళ్లూరుపేట మున్సిపాల్టీల్లో ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాలేదు. అయినా ఇప్పుడు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది కాబట్టి ఈ మున్సిపాల్టీలు కూడా ఆ పార్టీ ఖాతాలోనే చేరే అవకాశాలున్నాయి.

మొత్తానికి అధికారం చేతిలో వుంటే ఫలితాలే తారుమారవుతాయి. అధికారం వచ్చింది కాబట్టే ఈరోజు స్థానిక సంస్థలలో జంపింగ్ రాజకీయాలు జోరందుకున్నాయి.

# సోమిరెడ్డికే ఛాన్స్?

(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో మంత్రి పదవికి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేరే వినిపిస్తుంది. ఓడిపోయినా కూడా ఆయనకు మంత్రి పదవినిచ్చి ఆ తర్వాత ఎమ్మెల్సీని చేస్తారనే వూహాగానాలు వినిపిస్తున్నాయి. సర్వేపల్లి సీటు ఇచ్చేటప్పుడే చంద్రబాబు ఆయనకు హామీ ఇచ్చి వున్నారని, సర్వేపల్లి నుండి ఓడిపోయినా తన కేబినెట్‌లోకి తీసుకుంటానని చెప్పారని, కాబట్టే సోమిరెడ్డి అక్కడ పోటీకి దిగారనేది సమాచారం.

ఇక సీమాంధ్రలో అన్ని జిల్లాల్లో పార్టీ పరిస్థితి ఒకరకంగా ఉంటే నెల్లూరుజిల్లాలో ఇంకోరకంగా వుంది. ఇక్కడ పదింటిలో మూడే తెలుగుదేశం గెలిచింది. నెల్లూరు లోక్‌సభ కూడా ఓడిపోయింది. కాబట్టి వచ్చే ఐదేళ్లలోపు మళ్ళీ పార్టీని పటిష్టం చేయాల్సివుంది. ఇందుకు సోమిరెడ్డే సమర్ధుడనేది చంద్రబాబు దృష్టిలో వున్నట్లు సమాచారం. సోమిరెడ్డి లాగే పార్టీలో ఇంకొందరు సీనియర్‌లు ఓడిపోయి వున్నారు. సోమిరెడ్డికి ఇస్తే మంత్రి పదవులు వాళ్లు అడుగుతారనే ప్రచారం వుంది. అయితే ఇతర జిల్లాలో వేరు... నెల్లూరుజిల్లా వేరు. ఇక్కడ పార్టీని బలోపేతం చేయాల్సిఉంది. ఆ దిశలోనే సోమిరెడ్డికి మంత్రిగా అవకాశం వుందనే సమాచారం అందుతుంది.

# గెలిచాడు

(2వ పేజీ తరువాయి)

విషయంలో మేకపాటి వర్గం నుండి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఇంకొందరు నాయకుల నుండి పోటీని తట్టుకున్నాడు. ఎలాగోలా నెల్లూరునగర సమన్వయకర్త కాగలిగాడు. పార్టీ కార్యక్రమాలలో ఒళ్లు వంచి పనిచేసాడు. ప్రజాదీవెన ద్వారా నగరంలో ఇల్లిళ్లు తిరిగాడు. తన మీద సానుభూతిని పెంచుకున్నాడు. ముఖ్యంగా కేడర్‌ను పటిష్టం చేసుకున్నాడు. ప్రజలలో జగన్ పట్ల వున్న అభిమానాన్ని ఓట్ల రూపంలో సక్సెస్‌గా మలచుకున్నాడు. 5ఏళ్ల క్రితం 90ఓట్ల తేడాతో కోల్పోయిన ఎమ్మెల్యే పదవిని ఇప్పుడు 19వేల పైచిలుకు తేడాతో దక్కించుకున్నాడు. పోయిన చోటే కష్టపడి వెదికి చేజారిన విజయాన్ని తిరిగి అందుకున్నాడు.



# గూడూరు డివిజన్ వార్తలు

## డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ముగిసిన ఉచిత ఐసెట్ శిక్షణ


విద్యార్థులకు ఉచితంగా ఐసెట్ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో విద్యార్థులకు ఐసెట్ ఉచిత శిక్షణ తరగతులు నెలరోజులుగా నిర్వహిస్తున్నారు. సోమవారం నాడు జరిగిన ముగింపు కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డా॥కమలసాయి మాట్లాడుతూ శిక్షణలో రీజనింగ్, కంప్యూటర్ పరిజ్ఞానం, ఆంగ్లం, గణితం సబ్జెక్టులపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. నెల్లూరు అక్షర స్టడీసర్కిల్ వారు విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ అందజేశారు.

## సంస్కృతి, సమ్మేళనం రాష్ట్రస్థాయి నాటికల పోటీలు

గూడూరు పట్టణంలోని డిఎన్‌ఆర్ కమ్యూనిటీహాలులో ఈనెల 22వతేదీ నుండి 25వతేది వరకు సంస్కృతిక సమ్మేళనం, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి సాంఘిక నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కె.మునిగిరీష్ తెలిపారు. సోమవారంనాడు ఆయన మాట్లాడుతూ 1954లో ప్రారంభించిన సంస్థ 60ఏళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తోందన్నారు. పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ జిల్లాల కళాకారులు పాల్గొంటారన్నారు. నాటిక విభాగం వ్యవహార జానా శివయ్య మాట్లాడుతూ 8నాటికలను ఈ పోటీలలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘ అధ్యక్షులు సోమిశెట్టి చెంచురామయ్య, సాహిత్య విభాగ వ్యవహార ఎ.శివసుబ్రహ్మణ్యం, కోశాధికారి జి.జి.నాయుడు, సభ్యులు కట్టా మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ తొలి విద్యాసంస్థ వ్యవస్థాపకుడి మృతి

గూడూరులో 1977లో స్థాపించిన తొలి విద్యాసంస్థ శ్రీ వివేకానంద స్కూల్, దాని వ్యవస్థాపకులు కేశంశెట్టి పురుషోత్తంనాయుడు ఈ నెల 15వ తేదీన మృతి చెందారు. పలువురు పట్టణ ప్రజలు, స్కూలు యాజమానులు, అధ్యాపకులు సంతాపం తెలియజేశారు.

## ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించిన డిఎస్పీ చౌడేశ్వరి


ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న డిఎస్పీ చౌడేశ్వరి

గూడూరులోని డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఫ్యామిలీ కౌన్సిలింగ్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా చెన్నూరుకు చెందినవారు కుటుంబంలో కలహాలు రావడంతో వారి సమస్యను గూడూరు డిఎస్పీ కె.చౌడేశ్వరి పరిష్కరించారు. ఆమె మాట్లాడుతూ చిన్న తగాదాల వల్ల కేసుల్లో జైళ్ళకు పంపడం కంటే సమస్య పరిష్కరించడం మేలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ వివాదాలను పరిష్కరిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి శనివారం ఇక నుంచి ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు.


ఇటీవల గూడూరులో వేసవి కాలం సందర్భంగా చిన్నారులకు ఉచిత యోగా, వ్యాయామ, వజ్రాసనాలలో శిక్షణనిస్తున్న యోగాచార్య కట్టా మురళీకృష్ణను సన్మానిస్తున్న సంగీత కళాకారులు

## ఎన్నికల్లో గెలుపోటములు సహజమే



ఎన్నికల్లో గెలుపోటములు సహజమని మాజీ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు అన్నారు. గూడూరు రెండవ పట్టణ పరిధిలోని స్వర్ణభారతీనగర్‌లో సోమవారంనాడు పుర ఎన్నికల్లో గెలుపొందిన కౌన్సిలర్లు తెలుగుదేశంపార్టీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఐదేళ్ల పాటు గూడూరు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. పురపాలక సంఘ ఛైర్మెన్ పదవిని తెలుగుదేశం పార్టీ సొంతం చేసుకుంటుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధి శీలం కిరణ్‌కుమార్, నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెన్నకేశవునికి చక్రస్నానం

గూడూరు పట్టణంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామివారికి చక్రస్నాన మహోత్సవం జరిగింది. దేవదేవేరులకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తులు కోనేరులో పవిత్ర స్నానాలు చేశారు. రాత్రి ధ్వజారోహణం, హోమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ముక్క శశిధర్ పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా అనురాధ బాధ్యతల స్వీకరణ


గూడూరు పురపాలక కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న అనురాధ

గూడూరు పురపాలక సంఘ నూతన కమిషనర్‌గా రామిశెట్టి అనురాధ సోమవారంనాడు బాధ్యతలు చేపట్టారు. పూర్వకమీషనర్ సుశీలమ్మతో ఆమె సమావేశమయ్యారు. పురపాలకానికి సంబంధించి పలు విషయాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం అనురాధ మాట్లాడుతూ పట్టణ ప్రజల్లో ఒకరిగా కలిసి అభివృద్ధికి తోడ్పడుతానన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు. కార్యాలయంలో ప్రతి శాఖా సిబ్బంది విధుల్లో ముందుండేలా చూస్తామని, అవసరమైన ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. కండలేరు త్రాగునీటి పథకానికి సంబంధించి సమీక్ష జరిపి నిర్వహణను మెరుగుపరుస్తానని అన్నారు. రంగారెడ్డి, వరంగల్ జిల్లాలో పనిచేసి వచ్చానన్నారు. కొత్త పాలకవర్గం రాబోతుందని వారితో కలసికట్టుగా పనిచేసి పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. పూర్వకమీషనర్ జి.సుశీలమ్మ బదలీపై ప్రొద్దుటూరు వెళ్లారు.

## జిల్లా ప్రజలు జగన్‌కు అండగా నిలిచారు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మేరిగ మురళీధర్ ప్రక్కన బొమ్మిరెడ్డి, పాశం సునీల్, ఎల్లసిరి తదితరులు

జిల్లా ప్రజలు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అండగా నిలిచి దివంగత మహానేత పై ఉన్న ప్రేమను చాటుకున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరిగ మురళీధర్ అన్నారు. నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులను రెండో పట్టణంలోని పార్టీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి స్వగృహంలో ఆదివారం ఆయన అభినందించారు. అనంతరం మేరిగ మురళీధర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు వైఎస్సార్‌సీపీపై ఎనలేని అభిమానాలను ఓట్లరూపంలో చూపించారన్నారు. తిరుపతి, నెల్లూరు పార్లమెంటు స్థానాలతో పాటు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు నాలుగు మున్సిపాల్టీలు, 31జడ్పీటీసీలు, 30ఎంపీపీ స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుందన్నారు. స్థానిక సంస్థలతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకొని నెల్లూరు జిల్లా వైఎస్సార్ సీపీకి కంచుకోటగా నిలిచిందన్నారు. పార్టీ గెలుపునకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరంలేదని పార్టీ నాయకులంతా వారికి అన్ని వేళలా అందుబాటులో ఉంటామన్నారు. వైఎస్సార్ సీపీకి ఓట్లేసి విజయాన్ని అందించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ జడ్పీఛైర్మెన్ అభ్యర్థి బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మంచి విజయం సాధించిందన్నారు.

వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాతీర్పును శిరసా వహిస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధి నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంగా పనిచేస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో 1.9శాతం ఓట్లు మాత్రమే వైఎస్సార్‌సీపీ కంటే టీడీపీకి ఎక్కువ వచ్చాయన్నారు.

ఈ సమావేశంలో గూడూరు పట్టణ, రూరల్ కన్వీనర్లు నాశినాగులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, చిల్లకూరు మండల నాయకులు బుర్లా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎద్దల మధుసూదన్‌రెడ్డి, ఓజిలి బాలకృష్ణారెడ్డి, గూడూరు మండల నాయకులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పిట్లు నాగరాజు, గూడూరు రాజేశ్వరరెడ్డి, పి.మోహన్‌రావు, చేవూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ నేతాజీ MSR పైలట్ హైస్కూలు & రెసిడెన్షియల్ స్కూలు
శ్రీనివాస అగ్రహారం, నెల్లూరు-1.
e-mail: snphs@yahoo.com
ఫోన్. 0861-2329470, సెల్. 85005 52203, 94946 36316, 94902 05374.
2014 SSC ఫలితాలలో ఒకే బ్రాంచి నుండి 3వ సారి (హ్యాట్రిక్) స్టేట్ రికార్డ్స్ పొందిన సంస్థ
10/10 Points స్టేట్ రికార్డ్
2014

R. MAHIDHAR HT.No. 1417104132

K. NIKHILA HT.No. 1417102416
2013

SK. ARSHIYA YASMINE HT.No. 1317102590
2012

A. VEDASRI HT.No. 1217104140
అడ్మిషన్లు జరుగుచున్నవి
Play Class to X, VI to X - IIT & నవోదయ
వ్యాను సౌకర్యము కలదు.
హాస్టల్ వసతి కలదు.

# అ'సామాన్యుడు'

రాళ్ళలో రత్నాలు వుంటాయి. మట్టిలో మాణిక్యాలూ వుంటాయి. అది ఏ రంగమైనా సరే, చిత్తశుద్ధీ–అంకితభావం వుంటే, లక్ష్యం సాధించాలన్న దృఢ దీక్ష వుంటే..సామాన్యుడు సైతం అసామాన్యునిగా ఎదిగి..సమున్నత స్థాయిని అందుకుంటారనేందుకు ప్రజాహృదయనేత, భారతదేశ ప్రగతి ప్రదాత నరేంద్రమోడీయే ఒక ప్రత్యక్ష నిదర్శనం. గతంలో ఒక సాధారణ పౌరునిగానే వున్న వ్యక్తే...అచంచల దీక్షతో అంచలంచలుగా ఎదుగుతూ... అద్వితీయమైన మేధా సంపత్తితో రాణిస్తూ.. నేడొక శక్తిగా.. మహాశక్తిగా రూపొందారు. కోట్లాదిమంది భారతీయుల ఆశాకిరణంగా వెలుగులు చిందిస్తూ, ప్రజలకు తన మీదా, ప్రభుత్వం మీదా.. ఒక నమ్మకాన్ని, భరోసాను ఇచ్చేందుకు నేనున్నానంటూ.. ఖచ్చితమైన హామీని ఇస్తూ... రాజకీయ రంగంలో గతంలో ఎన్నడూ లేనంతగా ప్రజల హృదయాలను గెలుచుకుని.. అప్రతిహతంగా ముందుకు సాగుతున్నారాయన. అందుకే, మోడీ అంటే సామాన్యుడు కాదు.. అసామాన్యుడనే మాటే సరిపోతుంది. రాజకీయరంగంలో ఎన్నో అసాధ్యాలను సుసాధ్యాలుగా చేసి చూపించిన కార్యశీలి.. మహా ధీశాలి ఆయన. ఎంతటి కష్టనష్టాలెదురైనా మొక్కవోని దీక్షతో ముందుకు సాగడం ఆయన నైజం. అదే ఆయనను నడిపించింది. ఆయనను గెలిపించింది. దేశంలో ఆయన్నొక మహానేతగా.. మహోన్నత నేతగా నిలబెట్టింది.

ఎక్కడో గుజరాత్‌లోని ఒక మారుమూల గ్రామంలో, అత్యంత సాధారణ కుటుంబంలో జన్మించిన మోడీ.. అత్యంత విశాలమైన ఈ భారతావనికి నేతృత్వం వహించే మహోన్నత నేతగా ఎదిగారు. కోట్లాది మంది భారతీయులకు ఆశా జ్యోతిగా, ప్రజలు కన్న కలలను సాకారం చేసే మహా నాయకునిగా ఆయన అందరి ఆదరాభిమానాలను పొందారు. భారతజాతి కీర్తి పతాకాన్ని దశదిశలా రెపరెపలాడించే సత్తా–సామర్థ్యం

- భారతీయుల 'దిల్‌వాలాగా' మారిన చాయ్‌వాలా
- స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జన్మించిన తొలి ప్రధాని


వున్న ఏకైక నాయకునిగా ఆయన ప్రజలందరి ఆశీస్సులను అందుకున్నారు. పరుగులు తీసే అభివృద్ధికి మారుపేరే నరేంద్రమోడీ!..అవినీతి అక్రమాలను సహించలేని ఆయన తత్వం, ప్రతి మాటలోనూ–చేతలోనూ పొంగిపొరలే దేశభక్తి, ప్రజల అభ్యున్నతి కోసం అహరహం పరితపించే మనస్తత్వం..పెద్దల పట్ల, సమాజం పట్ల ఆయనకున్న విధేయత, దేశాన్ని ప్రగతిపథంలో ముందంజ వేయించాలనే లక్ష్యం... అశేష జనవాహిని మనసా వాచా కోరుకునే ఇలాంటి లక్షణాలన్నీ ఆయనలో పుష్కలంగా వున్నాయి. వీటన్నిటికంటే ముఖ్యంగా, దేశంలో పెచ్చరిల్లిపోతున్న అవినీతి అక్రమాలకు చెల్లుచీటీ రాయాలంటే.. అది ఒక్క మోడీకే సాధ్యమవుతుందనే భావన ప్రజల్లో బలంగా వుండడంతో, దాదాపు నూటపాతికేళ్ళుగా వేళ్ళూనుకున్న కాంగ్రెస్ మహావటవృక్షం సైతం మోడీ మహాజనప్రభంజనం ధాటికి నేలకూలిపోయింది. 1950 సెప్టెంబర్ 15వ తేదిన గుజరాత్‌లోని మెహ్సానా జిల్లాలోని వాద్‌నగర్‌లో, ఒక సామాన్య మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన నరేంద్రమోడీ చిన్నతనం నుంచీ జీవన పోరాటమే చేశారు. కష్టాల్లో వున్నప్పుడు వెరవకుండా టీ దుకాణంలో సైతం పనిచేశారు. కష్టాల సుడిగుండంలో వుంటూనే ఎంతో దీక్షతో చదువుకుని, గుజరాత్ విశ్వవిద్యాలయం నుంచి రాజనీతిశాస్త్రంలో మాస్టర్ డిగ్రీ సాధించారు. కాగా, విద్యార్థి దశ నుంచీ ఆయన అఖిలభారత విద్యార్థి పరిషత్‌లో నాయకునిగా పనిచేశారు. 1970లో విశ్వహిందూ పరిషత్‌లో చేరారు. ఆ తర్వాత రాజకీయాలపై మరింత ఆసక్తితో 1987లో భారతీయ జనతాపార్టీలో ప్రవేశించారు. పార్టీలో ఎంతో చిత్తశుద్ధితో పనిచేసి, అనతికాలంలోనే బిజెపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పదవిని చేపట్టారు. ఆ తర్వాత బిజెపిలో అగ్రనాయకులైన అద్వానీ, మురళీ మనోహర్ జోషి లాంటి ప్రముఖులతో మరింత సాన్నిహిత్యం పెరిగింది. 1990లో అద్వానీ చేపట్టిన అయోధ్య రథయాత్రకు, 1992లో మురళీమనోహర్ జోషి చేపట్టిన కన్యాకుమారి–కాశ్మీర్ రథయాత్రకు ఆయన ఇన్‌ఛార్జిగా పనిచేసి, తన పనితీరు ప్రత్యేకతను చాటుకున్నారు. ఆ తర్వాత, 1998లో బిజెపికి జాతీయ స్థాయిలో ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారంటే పార్టీ అభ్యున్నతికి, పార్టీ మరింత బలోపేతం అయ్యేందుకు నరేంద్రమోడీ చేసిన కృషి గణనీయమైనదని వేరే చెప్పనక్కర లేదు. ఆ తర్వాత వచ్చిన ఎన్నికల్లో బిజెపి విజయం సాధించింది. 2001లో బిజెపి నాయకత్వం గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోడీని నియమించింది. ఇక ఇక్కడినుంచీ మోడీ తిరుగులేని నేతగా మరింతగా ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సాధించుకున్నారు. ముఖ్యమంత్రి పీఠం అధిష్టించిన ఏడాదిలోపే గుజరాత్‌లో అద్భుత ప్రగతిని సాధించేందుకు బాటలువేశారు. 2002లో జరిగిన ఎన్నికల్లోనూ మోడీయే గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎన్నికైనారంటే, ప్రజలకు ఆయనపై వున్న అభిమానం ఎంత గాఢమైనదో తేటతెల్లమవుతుంది. అత్యుత్తమమైన పరిపాలనాదక్షునిగా, కార్యశీలిగా మోడీ ప్రజలందరికీ మరింతగా చేరువయ్యారు. ఆ తర్వాత 2007 ఎన్నికల్లోనూ మోడీకే ప్రజలు పట్టం కట్టారు. గుజరాత్‌లోని మణినగర్ శాసనసభా నియోజకవర్గం నుంచి ఆయన అఖండ విజయం సాధించి, మళ్ళీ మూడవసారి గుజరాత్ ముఖ్యమంత్రిగా పదవిని అధిష్టించారు. ఇన్నిసార్లు తాను సిఎం అయినప్పటికీ, ఆయన ఎల్లవేళలా పార్టీ పట్ల, ప్రజల పట్ల ఎంతో విధేయతతోనూ, వినమ్రతతోనూ వ్యవహరించారు. తాను 2001 నుంచే కాదు, అంతకుముందు నుంచి కూడా సిఎంనే అని ఆయన అనేవారు. 'సిఎం'..అంటే, 'కామన్ మ్యాన్' అంటూ.. ఆయన సగర్వంగా ప్రకటించి, సిఎం అనే అక్షరాలకు సరికొత్త భాష్యం చెప్పి, ప్రజలందరి మనసులనూ ఆకట్టుకున్నారాయన. తాను ముఖ్యమంత్రిగా వుంటూ, గుజరాత్‌ను ప్రగతి పథంలో అగ్రగామిగా నిలిపారు. 2012లోనూ ఆయన నాలుగోసారి ముఖ్యమంత్రిగా పదవిలోకి వచ్చి, ప్రజానేతగా రికార్డు సాధించారు. మోడీ పార్టీ అభ్యున్నతికి చేస్తున్న అపారమైన సేవలను దృష్టిలో పెట్టుకుని బిజెపి అగ్రనాయకత్వం 2013లో ఎంతో కీలకమైన బిజెపి పార్లమెంటరీ బోర్డులో సభ్యునిగా నియమించింది. అంతేకాదు, ఎంతో ప్రతిష్టాకరమైన బిజెపి ఎన్నికల ప్రచారకమిటీ సారధ్యబాధ్యతలను

- నాడు ముఖ్యమంత్రి హోదాలోనే తొలిసారిగా అసెంబ్లీలో అడుగు
- నేడు ప్రధానమంత్రిగానే మొదటిసారి పార్లమెంటులో పాదం

కూడా మోడీకి అప్పగించింది. ఆ తర్వాత, 2013 సెప్టెంబరు 13వ తేదిన భారతీయ జనతాపార్టీ తరఫున ప్రధాని అభ్యర్థిగా పార్టీ అగ్రనాయకత్వం మోడీని ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో, ఎన్నికల సమరభేరీ మ్రోగించిన మోడీ, దేశవ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేశారు. ఎన్నికల ప్రచారంలో గతంలో ఎన్నడూ లేని విధంగా, అధునాతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని, ప్రచారంలో అన్ని పార్టీలకంటే దీటుగా ముందంజలో నిలిచారు. దేశంలో కాంగ్రెస్ పాలనలోని లొసుగులను, అవినీతి అక్రమాలను తూర్పారబడుతూ, దేశంలో సుపరిపాలన రావాలంటే బిజెపికి అఖండ విజయం చేకూర్చాలని పదేపదే కోరారు. ప్రచారరంగంలో ఆయన ప్రత్యర్థులపై చేసిన విమర్శలు, విశ్లేషణలు, వ్యాఖ్యలు ప్రజల హృదయాలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. దీంతో, ప్రజలు ఈ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బిజెపికి తిరుగులేని విజయాన్ని సాధించిపెట్టారు. బిజెపి ప్రధాని అభ్యర్థిగా, ఎదురులేని జననేతగా ఎదిగిన మహానేత మోడీకి ప్రజలు ఘన నీరాజనాలు పలికారు. కాంగ్రెస్ పాలనను వ్యతిరేకిస్తూ ప్రజలు చారిత్రాత్మకమైన తీర్పునిచ్చారు. ఎన్నికల్లో విజయానంతరం ఆయన కాశీకి వచ్చి, గంగాహారతిలో పాల్గొన్న సందర్భంలో కాశీ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ, తానేదో అయిదేళ్ళ కాంట్రాక్ట్ కోసం రాలేదని, అందరం కలసి పని చేసి కాశీని బాగుచేసుకుందామని అన్నారు. పవిత్రమైన గంగానదిని శుభ్రపరచడం తన లక్ష్యమని, పరిశుభ్రమైన భారత్‌ను సాధించాలన్నదే తన ధ్యేయమనీ అన్నారు. తొలినుంచీ దేశభక్తితో తొణికిసలాడే మోడీ, జాతీయ భావాలతో ఎదిగిన నాయకుడు కావడంతో ప్రజలు ఆయన రాకతో దేశానికి ఇక మంచిరోజులు వచ్చాయని ఎంతో సంతోషపడుతున్నారు. ఒక సామాన్యుడు అసామాన్యునిగా ఎదిగి దేశంలోనే కాక, ప్రపంచస్థాయిలో ఇంతటి అఖండ ఖ్యాతినార్జించడాన్ని ప్రజలు ముక్తకంఠంతో మోడీని అభినందిస్తున్నారు. దేశంలోని ప్రజలందరి అభ్యున్నతికీ ఆయన అంకితభావంతో కృషి చేస్తారని, దేశప్రగతికి ఆయన మంచి రహదారులు వేస్తారని అందరూ ఎంతగానో ఆశిస్తూ.. శతకోటి ఆశలతో..ఆకాంక్షలతో ఎదురుచూస్తున్నారు.

### భారతీయుల 'దిల్‌వాలా'...

భారతీయుల మనసులను గెలుచుకున్న మోడీ ఇప్పుడు మామూలు 'చాయ్‌వాలా కాదు.. భారతీయుల దిల్‌వాలా'. తనకు ప్రధాని అయ్యే అవకాశం వచ్చిందని కాదు, ఆయన సంతోషం. సాక్షాత్తూ భరత మాతకు సేవ చేసే భాగ్యం కలిగిందన్నది ఆయన ఆనందం. దేశ మాతకు సేవచేసే



అవకాశం లభించిందన్న సంతోషం ఆయనను భావోద్వేగానికి లోను చేసింది. ఉద్వేగభరితమైన అనుభూతితో ఆయన కళ్ళలో ఆనందభాష్పాలు తొణికిసలాడాయి. ఆ అనుభూతి నిజంగానే అనిర్వచనీయం! అందుకే ప్రజలకు ఆయనంటే అంత అభిమానం. ఇలా చెప్పుకుంటూపోతే మోడీ నిజాయితీకి, నిబద్ధతకు ఎన్నెన్నో సాదృశ్యాలున్నాయి. అంతేకాక, మరెన్నో ప్రత్యేకతలూ ఆయనకున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జన్మించిన తొలిప్రధాని కూడా ఆయనే కావడం విశేషం. గతంలో గుజరాత్‌కు నేరుగా ముఖ్యమంత్రి హోదాలోనే ఆయన తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టడం మరో విశేషం. అదేవిధంగా, ఇప్పుడు కూడా బిజెపి ప్రధాని అభ్యర్థిగా నిలిచి అఖండ విజయం సాధించడమే కాక, దేశవ్యాప్తంగా బిజెపి విజయానికి గెలుపుబాటలు వేసిన మోడీ... ఇప్పుడు కూడా నేరుగానే ప్రధాని పీఠం అధిష్టించనుండడం మరో అద్భుతమైన విశేషం.


## అభినందనలు




పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా తమ అన్ని ప్రాజెక్టులలో
"క్లీన్ & గ్రీన్" కు ప్రాధాన్యత కల్పిస్తూ
'మన ప్రాజెక్ట్స్'ను మహా ప్రాజెక్టుగా తీర్చిదిద్దుతూ
నేడు అంతర్జాతీయ స్థాయిలో
ఆసియా పసిఫిక్ ప్రాపర్టీ అవార్డ్స్ వారిచే
'బెస్ట్ ఇంటీరియర్ డిజైన్ షో హోమ్' &
'రెసిడెన్షియల్ లాండ్‌స్కేప్ ఆర్కిటెక్చర్' అవార్డులను
మలేషియాలోని కౌలాలంపూర్‌లో అందుకున్న
'మన ప్రాజెక్ట్స్ ప్రై. లిమిటెడ్' మేనేజింగ్ డైరెక్టర్
**దేవిరెడ్డి కిషోర్‌రెడ్డి కి**
మా హార్దిక అభినందనలు.

D. Krishna Reddy (DK)

NAVYA BUILDERS
Bangalore


Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.